


విజయభాను

హైదరాబాద్, ఆదివారం 13-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 332 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బెదిరింపులకు పాల్పడితే

# విధ్వంసం చూస్తారు



### భారత్ స్వరం పెద్దది.. సహాయం చేస్తుంది

వాషింగ్టన్: క్షిపణుల ప్రయోగంతో ప్రపంచ దేశాలకు తలనొప్పిగా మారిన ఉత్తరకొరియా విషయంలో చర్యలు తీసుకునేందుకు భారత్ సహాయం తీసుకోవాల్సిందిగా యూఎస్ పసిఫిక్ కమాండ్ అడ్మిరల్ హ్యారీ హ్యారిస్ సూచించారు. భారతదేశ స్వరం పెద్దది. ఉ.కొరియా సమస్యను అర్థం చేసుకుని అమెరికాకు భారత్ సహాయం చేస్తుంది అని హ్యారిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇప్పటికే ఉ.కొరియా అమెరికా సమీపంలో గువామ్ ద్వీపంపై క్షిపణి దాడి చేస్తామని హెచ్చరించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగాలకు ఉ.కొరియా భారీ మూల్యం తరువాయి 2లో

# జగన్ అబద్ధం ఆడడు.. ఏం చెప్తే అదే చేస్తాడు

- అబద్దాలతో మళ్లీ చంద్రబాబు మోసం చేస్తారు..
- ధర్మం, న్యాయంవైపు నిలబడండి..
- నాలుగో రోజు రోడ్ షో లో వైఎస్ జగన్



నంద్యాల: రుణమాఫీ పేరుతో చంద్రబాబు రైతులను మోసం చేశారని, రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామన్న ఆయన మాటలు ఏమయ్యాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు మిర్చి పంటను కూడా నడిరోడ్డుపై తగలబెట్టే పరిస్థితి ఏర్పడిందని, చివరకు డ్వాక్రా అక్కాచెల్లెమ్మలను కూడా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల తరువాయి 2లో

## నగరాభివృద్ధిలో ప్రజలకూ

# భాగస్వామ్యం



- అటవీ భూములు అన్నిట్లో మొక్కల పెంపకం
- చెరువుల్లో కాలుష్యం చేరనీయొద్దు
- టీ-సీఎం కేసీఆర్

హైదరాబాద్: రాబోయే మూడు దశాబ్దాల అవసరాలకు తగినట్లుగా గ్రేటర్ హైదరాబాద్‌కు పదేళ్ల ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. రెండు మంచినీటి రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు రహదారులు, మురికి కాల్వలు, వరద కాల్వలు, విద్యుత్‌సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా సదుపాయాలు, మార్కెట్లు, మరుగు దొడ్లు, పచ్చదనం తదితర అంశాల్లో హైదరాబాద్ ఎలా ఉండాలో ప్రణాళికలు రూపొందించాలని నిర్దేశించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం శరవేగంగా పెరుగుతోంది. పెరిగే జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని మనం ప్రణాళికలు వేయాలి. రాబోయే 30 ఏళ్లకు నగరం ఎలా ఉంటుంది? జనాభా ఎంత పెరుగుతుంది? అప్పుడు ఏర్పడే అవసరాలు ఏమిటి? అనే కల్పన ఉండాలి. దానికి అనుగుణంగా ఇప్పటి నుంచే ఏర్పాట్లు ఎలా చేయాలని ఆలోచించాలి. కనీసం పదేళ్ల కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. ఇప్పటి నుంచి మనం చేసే ప్రతి పని ఆ ప్రణాళికలో భాగమై ఉండాలి అని నిర్దేశించారు. నగరాలు, పట్టణాల్లో నివసించే జనాభా విపరీతంగా పెరుగుతోందని, ఆ మేరకు వసతులు కల్పించాల్సి ఉందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోనే కోటి జనాభా ఉందని, ఈ నగరంపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నిరంతర కరెంటు ఇవ్వడానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చామని, అందులో విజయం సాధించామని, మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులకు సాగునీరు అందివ్వడానికి ప్రాజెక్టులు కడుతున్నామని, విద్యుత్, నీటి పారుదల ప్రాజెక్టులు బాగా సాగుతున్నాయని, ఇక మౌలిక సదుపాయాలు అందించే విషయమై ప్రభుత్వం తరువాయి 2లో

## జాతీయ సమైక్యత అవార్డుల ప్రదానం



వార్త 2వ పేజీలో



# ఎన్డీయేలోకి నితీశ్‌కు ఆహ్వానం

దిల్లీ: అధికార ఎన్డీయే కూటమిలో చేరాల్సిందిగా బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆహ్వానించారు. ఈ విషయాన్ని అమిత్‌షా తన ట్విటర్‌తో వెల్లడించారు. సీఎం నితీశ్ అమిత్‌షాను కలిసినపుడు ఎన్డీయేలో చేరాల్సిందిగా ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై జేడీయూ ఆలోచనలో పడింది. ఆగస్టు 19న పట్నాలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం తర్వాత ఎన్డీయేలో చేరికపై ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని జేడీయూ సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిపై జేడీయూ నేత ఒకరు మాట్లాడుతూ.. బిహార్ ప్రభుత్వంలో భాజపా, తరువాయి 2లో

## సెప్టెంబర్ 1న గుజరాత్‌లో సత్యాగ్రహ దీక్ష

దిల్లీ: ఈ నెల 27న పట్నాలో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ భాజపాకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భాజపాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సైతం సెప్టెంబర్ 1న గుజరాత్‌లో సత్యాగ్రహ ర్యాలీని చేపట్టేందుకు సిద్ధమైంది. గిరిజనులపై దాడులను నిరసిస్తూ చేపట్టనున్న ఈ ర్యాలీ కోసం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ఏడాది చివర్లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలోఈ ర్యాలీ ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. ఈ నిరసనకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వం వహించనున్నారని సమాచారం.

ఈ మహా నిరసనలో పాల్గొనాల్సిందిగా అన్నీ

## చైనా సరిహద్దులో భారీగా భారత సైన్యం



దిల్లీ: సిక్కిం సరిహద్దులోని డోక్లామ్ వివాదం నేపథ్యంలో భారత్-చైనా మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ విషయమై చైనా పలుమార్లు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ హెచ్చరికలకు సమాధానం చెప్పేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



మా పశువులకు ఆధార్ కార్డ్ వచ్చేసింది...
ఇంక రావల్సింది నాకే !!

# జీవో 68 ప్రకారం వేతనాలు చెల్లించాలి

## ఆసుపత్రుల పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్



హైదరాబాద్: తమకు 68జీవో ప్రకారం పూర్తి వేతనాలు అందించాలంటూ ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య ఉద్యోగులు, కార్మికులు ధర్నాకు దిగారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ నగర శాఖ, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలోని తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. సంఘం అధ్యక్షుడు ఎం.నరసింహా మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు జీవో ప్రకారం రూ.9470 వేతనం చెల్లించాల్సిఉన్నా కేవలం రూ.6వేలనుంచి రూ.7వేలు చెల్లిస్తున్నారన్నారు. వేతనం చెల్లింపుల్లో అన్యాయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జీవో 68మేరకు కార్మికులకు వేతనం అమలుచేయాలని, సెక్యూరిటీ సిబ్బందికి జీవో 43ప్రకారం జీతాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా తరువాయి 2లో

# ఆగస్టు 31 నుంచి కట్టుదిట్టంగా ట్రాఫిక్ నిబంధనలు

బ్రహ్మపుర : బ్రహ్మపుర నగరంలో వచ్చే 31వ తేదీ నుంచి ట్రాఫిక్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, శిరస్త్రాణాలు ధరించని ద్విచక్ర వాహనచోదకులకు రూ.200 నుంచి రూ.2 వేల వరకూ జరిమానా విధిస్తామని బ్రహ్మపుర ఎస్డీపీఓ శంతనుకుమార్ దాస్ స్పష్టం చేశారు. పెద్దబజారు ఠాణా ఆవరణలో గురువారం రాత్రి ఆమొ పోలీసు సమితి, బ్రహ్మపుర ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో బ్రహ్మపుర ఏఎస్పీ త్రినాథ్ పటేల్, సదర్ ఎస్డీపీఓ అశోక్ కుమార్ మహంతి, ట్రాఫిక్ డీఎస్పీ ఠాకూర్‌ప్రసాద్ పాత్ర, నగరంలోని వివిధ ఠాణాల ఐఐసీలు, గంజాం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశానంతరం ఎస్డీపీఓ దాస్ విలేఖరులకు ఆ వివరాలు తెలిపారు. ఆగస్టు 16వ తేదీ నుంచి నో హెల్మెట్-నో పెట్రోలు కట్టుదిట్టంగా అమలవుతోందని, ప్రజలంతా సహకరించాలని కోరారు. వచ్చే 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ట్రాఫిక్ నిబంధనలు, శిరస్త్రాణంపై ముమ్మర ప్రచారం చేస్తామన్నారు. 31వ తేదీ తర్వాత నుంచి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిని వదిలిపెట్టేది లేదన్నారు. శిరస్త్రాణం లేని ద్విచక్ర వాహన చోదకులు, ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి, ఎక్కువ వేగంతో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్డీపీఓ దాస్ పేర్కొన్నారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం



చెన్నై : నగరంలోని వేళమ్మాల్ పాఠశాల క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. మల్ల యోధులైన బబితా కుమారి, గీతా పోగట్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడలలో గెలిచిన విద్యార్థులకు వారు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు క్రీడల ఆవశ్యకతను తెలియజేస్తూ వారు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. వారి ఛాయాచిత్రాలు, చిత్రలేఖనాలతో విద్యార్థులు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## బహిరంగ మలవిసర్జన నివారణతోనే స్వచ్ఛత

బళ్లారి : స్వచ్ఛభారత్ అంటే కేవలం చెత్తచెదారం తొలగించడం, మురుగుకాల్వలు శుభ్రం చేయడం కాదు. దేశాన్ని బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చినప్పుడే స్వచ్ఛభారత్ కల నిజమవుతుందని జిల్లాపంచాయతీ ముఖ్య అధికారి డా.కె.వి. రాజేంద్ర అన్నారు. బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా విద్యార్థులు, యువకులు అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్యసాధనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆచార్య డా.శాంతనాయక్ స్వచ్ఛభారత్‌పై విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని యువకులకు సూచించారు. తొలుత వినాయక నగర్ నుంచి విశ్వవిద్యాలయం వరకు జాతా నిర్వహించారు. సుమారు 300మంది విద్యార్థులు, జిల్లాపంచాయతీ యోజనాధికారి చంద్రశేఖర్‌గుడి, నిష్టిరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

### గిరిబాల బెహర

కటక్ : వృద్ధాప్య, వితంతవుల పింఛన్ల పంపిణీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న సీఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని పీసీసీ కార్యదర్శి గిరిబాల బెహర ఆరోపించారు. కటక్ జిల్లా, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎంసీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆమె ప్రసంగించారు. సీఎంసీ అధికారులు బినామీ పేర్లతో పింఛన్లు మంజూరు చేసి ఆయా మొత్తాలు అధికారులు మింగుతున్న విషయం ఇటీవల మీడియా వెలుగులోకి తెచ్చిందన్నారు. ముందుకు నగరంలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, నగరంలో రోడ్లు దీనస్థితికి చేరాయని, పరిశుభ్రత లోపించిందని ఆరోపించారు. సీఎంసీ అధికారులు నిర్లక్ష్యం ఎంతో ఉందని ఆందో ళన వ్యక్తం చేశారు. ఉత్సవాలకు ముందు నగరంలోని రహదారు లను మెరుగు పరచాలని డిమాండు చేశారు. ఆందోళనలో యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



బ్రహ్మపుర : స్థానిక శ్రీ కేదారేశ్వరస్వామి బెడా భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దేశిబెహరా వీధిలోని కేదారేశ్వర స్వామి మందిరం ప్రాంగణంలో ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. 131 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలంతా పూజా సామగ్రితో స్థానిక జగబంధు వీధిలోని బాణాలింగేశ్వర స్వామి మందిరం వరకూ వూరేగింపు నిర్వహించారు. అక్కడి చెరువులో పూజా సామగ్రిని నిమజ్జనం చేశారు. అనంతరం కేదారేశ్వరస్వామి మందిరం ప్రాంగణంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ భజన కార్యక్రమం నిర్వహించారు. చివరిగా సాయంత్రం ఇదే ఆవరణలో 54 మంది భక్తులతో శివారాధన (గణార్చన) చేపట్టారు. వరలక్ష్మీ వ్రతాలను వి.వెంకటరమణ, ఎస్.హేమ చంద్రరావు నిర్వహించారు. నిర్వాహక భక్త బృందం ప్రతినిధులు మొత్తం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## అతి పురాతన వస్తువుల లభ్యం



చెన్నై : రామనాథపురం సమీపం అళగన్‌కులం ప్రాంతంలో తమిళనాడు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగే తవ్వకాలలో క్రీ.పూ. 300 నాటి అనేక నాణేలు, ఆభరణాలు బయట పడ్డాయి. ఈ గ్రామం పూర్వ కాలంలో వాణిజ్యం, ఓడరేవుగానూ విరాజిల్లింది. పురావస్తు శాఖ రూ.55 కోట్లతో ఇక్కడ తవ్వకాలు చేపట్టింది. మొదట ప్రభుత్వ పాఠశాల్లో 16 గుంతలు తవ్వారు. ప్రస్తుతం దాని వెనుక వైపున కోటమేడు ప్రాంతంలో వంద మంది కార్మికులు తవ్వకపు పనులు చేస్తున్నారు. సంబంధిత అధికారి జె.భాస్కర్ దీనిపై మాట్లాడుతూ.... ఇక్కడ దేశంలోనే తొలిసారి మానవులు ఉపయోగించిన వెండి, రాగి నాణేలు, ఏనుగు దంతాలు, శంఖువులతో తయారుచేసిన ఆభర ణాలు, మట్టి బొమ్మలు వంటివి బయట పడ్డాయని చెప్పారు. రోమన్ ప్రాంతం నుంచి దిగుమతి చేసిన మట్టి బానలు కూడా ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు.

## అవయవదానంపై అవగాహన జాతర

బెంగళూరు :అవయవదానంపై ప్రజల్లో జాగృతి కల్పించేందుకు బెంగళూరులోని మణిపాల్ వైద్యాలయం, స్ప్రెడింగ్ హోప్ ఫౌండేషన్ నేతృత్వంలో ప్రారంభించిన కార్య క్రమాన్ని సీనియరు పోలీసు అధికారి ప్రవీణ్ సూద్ ప్రారంభించారు. అవయవ దానం పొంది శస్త్రచికిత్సను చేయించుకున్న లూర్ద్ విజయ్ జాగృతి యాత్రను నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. బెంగళూరు నుంచి లడక్ వరకు తొమ్మిది వేల కిలోమీటర్ల దూరం ఆయన జాగృతి వాహనంలో ప్రయాణించనున్నారు. అవయవ దానంపై ప్రతి ఒక్కరికీ పలు అపోహలు ఉంటాయని, వాటిని తొలగించేందుకు ఈ జాగృతి యాత్ర సహకరిస్తుందని ఏడీజీపీ ప్రవీణ్ సూద్ పేర్కొన్నారు. తన జాగృతి యాత్రకు మద్దతుగా నిలిచిన మణిపాల్ వైద్యాలయం, ఇతర సంస్థల ప్రతినిధులకు లూర్ద్ విజయ్ ధన్యవాదాల్ని తెలిపారు. కార్యక్రమంలో నటి షర్మిలా మాండ్రే, వైద్యాలయ నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ హెచ్.సుదర్శన్ బళ్లాల్ తదితరులు పాల్గొన్నారు.

## వూటీలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం

విల్లవాక్కం : నీలగిరిలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం విధించారు. జిల్లా సరిహద్దులోని చెక్ పోస్టులలో తనిఖీ చేసి వాటిని కలిగి ఉన్నవారికి రూ. 1,000 జరిమానా విధించాలని తీర్మానించారు. నీలగిరి జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగాన్ని నివారించడానికి జిల్లా నిర్వాహకం చర్యలు చేపడుతోంది. ప్రకృతి పరిరక్షణకు పర్యాటకులు పూర్తి సహకారాన్ని అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇది కొండ ప్రదేశమైనందువల్ల ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనచోదకులు మలువులు ఉన్న ప్రాంతాలలో రెండో గేర్ ఉపయోగించాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్లను నివారించాని కోరారు. కలెక్టర్ ఇన్నసెంట్ దివ్య మాట్లాడుతూ.. నీలగిరి ప్రకృతి వనరుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందుకు అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు.

## ఘనంగా అన్నకూట మహోత్సవం

చెన్నై : జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఏర్పాటైన అన్నకూట మహోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలోని వాసవి విడిది భవనంలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతులు కలశ, పాల బిందెల పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. మహిళలు పాల బిందెలతో విడిది గృహం నుంచి ఆలయానికి మంగళవాయిద్యాల నడుమ వచ్చారు. మూలవిరాట్టు, ఉత్సవ మూర్తికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పలు రకాల పుష్పాలు, స్వర్ణ కవచంతో నేత్ర పర్వంగా అలంకరించారు. అన్నకూట మహోత్సవం పేరిట పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని అమ్మవారి ముందు రాశిగా పోశారు. ధూప, దీప ఆరాధనలు చేశారు. మహిళలు శ్రీ లలితా సహస్ర నామావళిని బృంద పారాయణం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శైలజా విజయభాస్కర్, చందనా బృందం భక్తి గీతాలాపన ఆకట్టుకుంది. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

## కంచుకోటలు కాపాడండి

సిరుగుప్ప : బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప, సండూరు నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు కంచుకోటలు. ఇక్కడ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించాలని కలబురగి విభాగం కాంగ్రెస్ బాధ్యుడు డాక్టర్ సాకె శైలజానాథ్ పిలుపునిచ్చారు.

# 3న వినాయక విగ్రహాల నిమజ్జనం

**- శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలి - పోలీస్ కమిషనర్ వై.బి.ఖురానియా**

కటక్ : వినాయకుని ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ప్రజలు, పూజా కమిటీల కార్యకర్తలు సహకరించాలని పోలీస్ కమిషనర్ వై.బి.ఖురా నియా అన్నారు. ఈ ఏడాది కటక్‌లో జరిగే వినాయకుని ఉత్సవాల కోసం కమిషనరేట్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వినాయకుని నిమజ్జనోత్సవాలు మూడు విడతల్లో నిర్వహించేందుకు నిర్ణయాలు తీసుకున్నామని, పూజా కమిటీలు, యువజన సంఘాల వూరేగింపులకు ఉన్న విధానాలు పాటించాలని కోరారు. శబ్దకాలుష్యం నియంత్రణకు వూరేగింపులో 65 డెసిబల్ కంటే అధిక శబ్దం సృష్టించే లౌడ్‌స్పీకర్లు వినియోగించకూడదన్నారు. ఒక వూరేగింపులో ఆరు ట్రాలీ రిక్షాలు మాత్రమే వినియోగించాలన్నారు. ఈ నెల 25న వినాయకుని పూజల ప్రారంభమవుతాయని, విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 10 గంటల లోగా ముగించాలని సూచించారు. వూరేగింపులు జరిగే సమయంలో ప్రధాన మార్గాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తూ వూరేగింపులపై నిఘా సారిస్తామని తెలిపారు. సెప్టెంబరు 3, 10, 17 తేదీలలో విడతల వారీ నిమజ్జనాలు జరుగుతాయని తెలిపారు. కమిటీలు చందాలు వసూళ్ల పేరిట ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విగ్రహాల నిమజ్జనాలకు కఠజోడి నదీ తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విగ్రహాలు నదిలో వేయకుండా నదీ తీరంలో ఏర్పాటు చేసే గుంతల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు ప్రభాత్ త్రిపాఠి, దేవాసిష్ సామంత్రాయ్, ప్రభాత్‌రంజన్ బిశ్వాళ, మేయర్ మీనాక్షి బెహర, కాంగ్రెస్ నేత సురేష్ మహాపాత్ర, శాంతికమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## నగరాభివృద్ధిలో ప్రజలకూ భాగస్వామ్యం

దృష్టి కేంద్రీకరిస్తుందని తెలిపారు.

ఈ సమీక్షలో మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్ రావు, రామకృష్ణ, మునిసిపల్ కార్యదర్శి నవీన్ మిట్టల్, జీహెచ్‌ఎంసీ కమీషనర్ జనార్దన్ రెడ్డి, హెచ్‌ఎండీఏ కమీషనర్ చిరంజీవులు, వాటర్ వర్క్స్ కమిషనర్ దానకిషోర్, పీసీసీఎఫ్ ప్రశాంత్ కిషోర్ ఝా, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సమీక్షలో ముఖ్యమంత్రి చేసిన సూచనలు**

హైదరాబాద్‌లో మంచినీటి సరఫరాకు శాశ్వత ప్రాతిపదికన రెండు రిజర్వాయర్లు నిర్మించాలి. గోదావరి నదిపై కడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక రిజర్వాయర్‌ను, కృష్ణా నదిపై కడుతున్న పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా మరో రిజర్వాయర్‌ను నింపాలి. గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేసి, 10-15 టీఎంసీలు నిల్వ ఉండేలా రిజర్వాయర్లు నిర్మించాలి.

హైదరాబాద్ చుట్టూ ఉన్న వేలాది అటవీ భూముల్లో విరివిగా మొక్కలు పెంచాలి. నాగోల్, నారపల్లి ప్రాంతాల్లో ఏడెనిమిది వేల ఎకరాల అటవీ భూమి ఉంది. శంషాబాద్ విమానాశ్రయం ప్రాంతంలో ఓఆర్‌ఆర్ అవతల మరో 16 వేల ఎకరాల అటవీ భూమి ఉంది. నర్సాపూర్, శిశంపేట ప్రాంతంలో 40 వేల ఎకరాల అటవీ భూమి ఉంది. అన్నిచోట్లా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. వాటిని పెంచాలి. ఓఆర్‌ఆర్ పొడవునా ఇరువైపులా వేప, గుల్మోర్, రావి మొక్కలు నాటాలి. ఇందుకు ఐఎఫ్‌ఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా మున్సిపల్ మంత్రి పేషీలో నియమించాలి.

నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి. అందుకోసం బస్తీ కమిటీలు వేయాలి. ప్రతి డివిజన్‌కు 10 కమిటీలు ఉండాలి. 15 రోజుల్లోగా వీటి నియామకం పూర్తి కావాలి.

గండిపేట, హిమాయత్ సాగర్, శామీర్‌పేటతోపాటు నగరంలో అనేక చెరువులున్నాయి. వాటిలో పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్యం చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలి. మూసీ నదిలో మురికి నీరు చేరకుండా చూడాలి. మూసీకి రెండు వైపులా ఉద్యానవనాలు అభివృద్ధి చేయాలి.

## జీవో 68 ప్రకారం వేతనాలు చెల్లించాలి

అమలుచేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఓ ప్రతినిధి బృందం టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఎండీ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి ఎం.లక్ష్మిబాయి, నేతలు హసీనాబేగం, కిష్టమ్మ, వినోద, మదన్‌సింగ్, కె.లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత అవార్డుల ప్రదానం

నారాయణగూడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో సృజన సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల ప్రముఖులను జాతీయ సమైక్యత పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాలను ప్రదానంచేశారు. అనంతరం డా.టి.ప్రభాకర్, పి.చంద్రమ్మ, కవి రఘుశ్రీ, ఆర్వీ రమణమూర్తి, ఎం.శ్రీనివాసులు, హనుమేశ్ ఆచారి, తాటి నర్సప్ప, సన్యాసి, రవికుమార్, ప్రసాదరావు తదితరులుకు అవార్డులను ప్రదానం చేశారు. డా. శ్రీకాంత్‌గౌడ్, ఎన్.రవికుమార్ బృందం కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## బెదిరింపులకు పాల్పడితే విధ్వంసం చూస్తారు

చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇలాగే బెదిరింపులకు పాల్పడితే ఎప్పుడూ చూడని విధ్వంసం చూడాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. జులై నెలలో ఉ.కొరియా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఆ క్షిపణుల ప్రయోగాన్ని భారత్ సహా ఇతర దేశాలు తీవ్రంగా ఖండించాయి. దాంతో పాటు ఉ.కొరియాతో ఉన్న వాణిజ్య సంబంధాలను కూడా భారత్ ఈ ఏడాది ప్రారంభంలోనే తెగదెంపులు చేసుకుంది. భారత్ తీసుకున్న నిర్ణయాన్ని అప్పట్లో ట్రంప్ ప్రభుత్వం ప్రశంసించింది.

## జగన్ అబద్ధం ఆడడు.. ఏం చెప్తే అదే చేస్తాడు

ప్రచారంలో భాగంగా నాలుగో రోజు శనివారం వైఎస్ జగన్ రోడ్ షో... గోస్పాడు, శ్రీనివాసపురం, యాలూరు మీదగా కొనసాగింది. ఉద్యోగాల పేరుతో యువతను కూడా చంద్రబాబు మోసం చేశారని, జాబు రావాలంటే బాబు రావాలి అన్నారని, లేదంటే రూ.2వేల నిరుద్యోగ భృతి అన్నారు... ఏమైందని వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. ఇప్పటి వరకూ ప్రతీ ఇంటికీ చంద్రబాబు రూ.76వేలు బాకీ పడ్డారన్నారు. పేదవారిని కూడా చంద్రబాబు వదిలిపెట్ట లేదని, ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇస్తామన్నారని, ఈ మూడున్నరేళ్లలో ఒక్క ఇల్లు అయినా కట్టించారా? అని అడిగారు. చంద్రబాబు సీఎం కాకముందు రేషన్ షాపుకు వెళితే తొమ్మిది రకాల సరుకులు ఇచ్చేవారని, కానీ బాబు సీఎం అయ్యాక బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు చెప్పిందేమిటి?..ఇప్పుడు చేస్తుందేమిటి?.. కర్నూలుకు ఎయిర్‌పోర్టు, ఉర్దూ వర్శిటీ, స్మార్ట్ సిటీ, ట్రిపుల్ ఐటీ, రైల్వే వ్యాగన్ల ఫ్యాక్టరీ, ఫుడ్ పార్క్, ఇండస్ట్రీయల్ సిటీ అన్నారని, అంతేకాకుండా రైతులను మోసం చేసేందుకు గుండ్రేవుల ప్రాజెక్ట్ పూర్తి చేస్తామన్నారని, వీటిలో చంద్రబాబు ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా చంద్రబాబు మళ్లీ వస్తున్నారని, మరోసారి మోసం చేసేందుకు మళ్లీ టేప్ రికార్డర్ ఆన్ చేస్తారని వైఎస్ జగన్ అన్నారు. నంద్యాలకు ఇది చేస్తా... అది చేస్తానంటూ మోసం చేస్తారని, హామీల పేరుతో ఇలా మోసాలు చేసే చంద్రబాబును ప్రశ్నించకూడదంట. ఇలాంటి వ్యక్తికి ఉరిశిక్ష విధించినా తప్పులేదు. చంద్రబాబులా నా దగ్గర డబ్బు, అధికారం, దుర్బుద్ధి, పోలీసులు లేరు. లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా చూపే చానళ్లు, పేపర్లు నా దగ్గర లేవు.

నాకున్న ఆస్తి నాన్నగారు ఇచ్చిన పెద్ద కుటుంబమే. వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలే ఇప్పటికీ ప్రజల గుండెల్లోఉన్నాయి. జగన్ అబద్ధం ఆడడు.. ఏం చెప్తే అదే చేస్తాడు. జగన్ నాన్నాల రైతుల గురించి, అక్కచెల్లెమ్మల గురించి ఆలోచిస్తాడు. అవినీతి సొమ్ముతో మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు వస్తారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్లే.. ప్రజలను కొనుగోలు చేయాలని చూస్తారు.

మూటలు, మూటలు డబ్బులు పట్టుకుని వస్తారు. రూ.5వేలు ఇచ్చి, దేవుడి పటంపై ప్రమాణం చేయించుకుంటారు. అలాంటి సమయంలో దేవుడిని ప్రార్థించి లౌక్యంగా ఓటేయండి. ధర్మం, న్యాయంవైపు నిలబడండి. నవరత్నాలతో అందరి జీవితాల్లో వెలుగులు నింపుతా. మీ ఓటుతో నేను వెంటనే ముఖ్యమంత్రి కాకపోవచ్చు. కానీ ఏడాది తర్వాత జరిగే కురుక్షేత్రానికి ఈ ఎన్నికే నాంది. వైఎస్‌ఆర్ సీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించండి అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## ఎన్డీయేలోకి నితీశ్‌కు ఆహ్వానం

జేడీయూ భాగస్వామ్యమైనప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చేరడమనేది సహజమైన విషయమేనన్నారు. మహా కూటమి నుంచి ఇటీవల జేడీయూ విడిపోయి భాజపాతో కలిసి బిహార్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## చైనా సరిహద్దులో భారీగా భారత సైన్యం

సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లలోని చైనా సరిహద్దుకు భారీగా సైనిక బలగాలను పంపినట్లు పీటీఐ సహా కొన్ని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే దీనిపై ఆర్మీ అధికారులు స్పందించేందుకు నిరాకరించారు. సైన్యం అంతర్గత వ్యవహారాలను బయటకు వెల్లడించకూడదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

డోక్లాం వివాదం నేపథ్యంలో ఇరు దేశాల మధ్య గత రెండు నెలలుగా ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. డోక్లాం ప్రాంతం తమ దేశంలోని భూభాగమేనని చెబుతూ అందులో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టింది చైనా. అయితే అది భారత్-భూటాన్-చైనా ట్రైజంక్షన్ కావడంతో ఆ పనులను భారత సైన్యం అడ్డుకుంది. రోడ్డు నిర్మాణం చేపడితే.. అది భారత సరిహద్దు భద్రతపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో ఆ పనులను సైన్యం అడ్డుకుంది. అయితే అప్పటి నుంచి చైనా.. భారత్‌పై హెచ్చరికలకు పాల్పడుతోంది. భారత సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని లేదంటే యుద్ధమే పరిష్కారమని బెదిరింపులకు దిగింది.

కాగా.. భారత్ మాత్రం దౌత్యపరమైన చర్చలతో పరిష్కారం సాధ్యమవుతుందని భావిస్తోంది.

కానీ.. చైనా మాత్రం ఈ విషయాలను పట్టించుకోకుండా దూకుడుగా వ్యవహరిస్తోంది. దీంతో చైనాకు దీటుగా బదులిచ్చేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో డోక్లాంలో ఏం జరగబోతోందనన్న ఉత్కంఠ నెలకొంది.

## సెప్టెంబర్ 1న గుజరాత్‌లో సత్యాగ్రహ దీక్ష

ప్రతిపక్ష పార్టీలను ఆహ్వానించామని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. ఈ నిరసనతో తమ సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది.

ప్రస్తుతానికి విపక్ష పార్టీలు ఈ నిరసనకు మద్దతు తెలుపుతాయా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# సంబరంగా కృష్ణాష్టమి వేడుకలు

నిర్మల్ : శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించు కొని జిల్లాకేంద్రంలోని వాసవి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుని జననం, కారాగారంలో ఉన్న కృష్ణుని తల్లి దేవకికి మహావిష్ణువు అభయవి వ్వటం, వసుదేవుడు శ్రీకృష్ణుని యశోద వద్దకు చేర్చే సన్నివేశాలను నాటిక రూపంలో అభినయించారు. అనంతరం శ్రీకృష్ణుని జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరిం చారు.

పలువురు చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుని వేష ధారణలో నృత్యాలు చేసి ఉట్టికొట్టారు. ఇందులో ప్రధా నోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.





# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## పేద విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు పంపిణీ

నర్సాపూర్ : మండలంలోని టెంబుర్ని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక నేతాజి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో పుస్త కాలు, బూట్లు, సాక్సులు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఉద్యోగ సంఘం నాయకులు చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మి, నేతాజి ఉద్యోగ సంఘం అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి వై.సాయన్న, కోశాధికారి ఫణిందర్, కార్యవర్గ సలహాసభ్యులు ముత్తన్న, ఎస్.గంగన్న, ఉప సర్పంచి సంటెన్న, గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## విస్తరణ పనులు వేగిరం చేయాలి: జలగం

కొత్తగూడెం : జాతీయరహదారి విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు అన్నారు. ఆయన జాతీయ రహదారుల శాఖ అధి కారులతో తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముర్రేడు వంతెన నుంచి రామవరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి విస్తరణ పనులను చేపట్టాలన్నారు. పనుల్లో పురోగతి కన్పించేలా చర్యలు తీసు కోవా లన్నారు. అధికారులు స్థానికంగా ఉండాలన్నారు. పనులు ఇక్కడ సాగుతుంటే అధికారులు మాత్రం ఇతర జిల్లాలనుంచి రాకపోకలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. నిర్మాణ పనుల్లో రోజువారీ నివేదికలు అవసరమన్నారు. అధికారులు అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షించాలన్నారు.

తాగునీటి పనులను వేగవంతం చేయండి

తాగునీటి పనులను వేగవంతం చేయా ల్సిందిగా కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సదాశివరావు, డీఈ అర్జున్‌రావు, ఏఈ తాతా రావుతో ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తాగునీటి సరఫరా కోసం కొనసాగుతున్న పనుల్లో రోజువారీ నివేదికలను అందించాలన్నారు. పైపులైన్లు ఏ రూట్లో వెళ్తున్నాయో మ్యాపుల ద్వారా గుర్తిం చాలన్నారు. గరీబ్‌పేట తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలన్నారు. అవసరమైతే ట్యాంకుల ద్వారానైనా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి సమస్యపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు.

## గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన గురుకుల విద్యాలయాలు సమస్య లకు నిలయంగా మారాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్ విమర్శిం చారు. గురుకుల విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని, అందరికీ సమానమైన విద్యను అందించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా శుక్రవారం ఖమ్మంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ ప్రదర్శనగా వె%రారోడ్డు మీదుగా ధర్నాచౌక్‌కు చేరుకొని ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ప్రదీప్ మాట్లా డుతూ రాష్ట్రంలో ధనిక, పేద, కుల, మత బేధాలు లేకుండా అందరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత, సమానమైన విద్యను అందించా లన్నారు. అందుకోసం పేరుకు గురుకులాలు ఏర్పాటు చేసినా వాటిలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయన్నారు. అరకొర సౌకర్యాలు మాత్రమే కల్పించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో సమస్యలు తెలుసుకునేందుకు పీడీఎస్‌యూ విద్యార్థులు సర్వేలు చేస్తే అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. తక్షణమే గురుకుల పాఠశాలల్లోని, ప్రభుత్వ పాఠశాలల్లోని సమ స్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీ ఎస్‌యూ జిల్లా కార్యదర్శి శరత్, అధ్యక్షుడు సురేశ్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆజాద్, నాయకులు మహిరున్నీసాబేగం, వర్ధన్, వెంకటేశ్, మణికంఠ, మస్తాన్, తిరుపతయ్య, అశోక్, చారి, కోటి పాల్గొన్నారు.

## ఖమ్మం ఇక బహిరంగ మలవిసర్జన రహిత నగరం

### మేయర్ పాపాలాల్ వెల్లడి

ఖమ్మం : ఖమ్మం నగరాన్ని బహిరంగ మల విసర్జన రహిత నగరంగా మేయర్ డాక్టర్ గుగులోత్ పాపాలాల్ ప్రకటించారు. తన ఛాంబర్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన రహిత నగరంగా ఖమ్మంను ప్రాథమికంగా ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే నిర్దేశించిన మేరకు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినట్లు ఆయన తెలిపారు. నగరపాలకసంస్థ పరిధిలో 4543 మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించగా, వాటిలో 4339మందికి స్వచ్ఛభారత్, స్వచ్ఛతెలంగాణ కార్యక్రమం కింద నిర్మించినట్టు తెలిపారు. 209 కుటుంబాల వారు వలస వెళ్లగా వారి ఇళ్లలోను మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు.

11 సామాజిక భవనాల్లో, 22 పెట్రోలు బంకుల్లో, ఆరు ప్రజా మరుగు దొడ్లు, 10 మాడ్యులర్ మహిళల మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండల రావు, కమిషనర్ బి.శ్రీనివాస్, ఏసీపీ రామ చందర్‌రావు, డీఈఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ-నామ్‌కు సహకరించాలి

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించే ఈ-నామ్ లావాదేవీలకు వ్యాపారులు సహకరించాలని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆర్‌జేసీ కృష్ణ కోరారు. మార్కెట్ కమిటీ కార్యా లయంలో అధికారులు, వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పత్తి, అపరాల్లో ఈనామ్ అమలు జరుగుతోందన్నారు. ప్రస్తుతం మిర్చి యార్డులో కూడా అమలు జరుగుతున్నందున అన్ని రకాల పంట ఉత్ప త్తులకు సంబంధించిన లావాదేవీలకు వ్యాపారులు సహకరిం చాలని అన్నారు. మార్కెట్‌లో ఇక నుంచి సింగిల్ లైసెన్స్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇక నుంచి దీనికి సంబం ధించిన లైసెన్స్ హైదరాబాద్‌లో తీసుకొని రాష్ట్రంలోని ఏ మార్కెట్‌లోనైనా వ్యాపారులు యధేచ్ఛగా వ్యాపారం చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. మార్కెట్‌లో పని చేసే ప్రతి ఒక్కరికి కూడా త్వరలోనే ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇస్తుందని కృష్ణ చెప్పారు. ఈసమావేశంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి సంతోష్‌కుమార్, వర్తక సంఘం ప్రధానకార్యదర్శి గొడవర్తి శ్రీనివాస రావు, దిగుమతిశాఖ అధ్యక్షుడు వీరెల్లి యుగంధర్, ఇతర సంఘా లకు చెందిన తేరాల ప్రవీణ్‌కుమార్, తేరాల భాస్కర్, గోపాల్‌రావు, వెంకటరమణ, భాస్కర్‌రావు, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ప్రకటనపై కేసీఆర్ సమాధానం చెప్పాలి

ఖమ్మం : నేరెళ్ల ఘటన విషయమై మంత్రి కేటీఆర్ ప్రకటనపై సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సుందరయ్యభవన్‌లో యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేరెళ్ళ ఘటనపై తొలుత స్పందించిన కేసీఆర్ పోలీసుల తప్పేం లేదని, నేరం చేసిన రౌడీలను ముద్దు పెట్టుకుంటారా? నేరగాళ్లు, గుండాలను సమర్థిస్తారా? అంటూ ప్రతిపక్షాలపై సీఎం అవాకులు, చెవాకులు పేలారన్నారు. ఇదే ఘటనపై ఆయన కుమారుడు కేటీఆర్ చేసిన ప్రకటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఆలస్యంగానైనా బాధితులను పరామర్శించి ఈ ఘటనకు బాధ్యున్ని చేస్తూ ఎస్సైని సస్పెండ్ చేశారన్నారు. ఇప్పటి వరకు మాతో సహా ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు చేసిన ఆందోళన సరైనదని కేటీఆర్ ప్రకటన రుజువు చేసిందని అన్నారు.

స్థాయి మరిచి నోరు పారేసుకున్న ముఖ్యమంత్రి ప్రజ లకు, ప్రత్యేకించి ఆ బాధితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సైని సస్పెండ్ చేసి చేసిన పాపం నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదని, దీనివెనుకున్న ఇసుక మాఫియాను, వారిని కాపాడుతున్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, మల్సూర్, నర్సయ్య, శ్రీనివాసులు, నరసయ్య, భారతి, సమీనా, పద్మ, రాంబాబు, భాస్కర్‌రావు, వీరభద్రం, కృష్ణ, సత్యనారాయణ, మనో హర్, విక్రమ్, శ్రీనివాస రావు, కోటేశ్వరరావు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నిర్మల్ : పట్టాదాసు పాసుపుస్తకాల ప్రకారం భూములకు సంబంధించి సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సంయుక్త పాలనాధికారి సీహెచ్.శివలింగయ్య అన్నారు. స్థానిక పాలనాప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వెబ్‌ల్యాండ్ డాటా ఎంట్రీ రికార్డుకు అనుగుణంగా గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు గ్రామాల్లో పర్య టించి వివరాలు సేకరించాలన్నారు. రైతులకు సంబంధించిన సమాచారం గ్రామ పంచాయతీల వారీగా గ్రామ రెవెన్యూ అధికారులకు తెలిసి ఉండాలన్నారు. చాలా మండలాల్లో పహాణీలు తప్పులుగా ఉన్నాయని, వాటిని కొత్త రికార్డుల ప్రకారం సరిచేయాలన్నారు. ఇక గ్రామంలో వివరాలు సేకరిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారికి అందరూ సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో అటవీ భూములు, చెరువుల కింద, వ్యవసాయ, ఇతర్రతా భూముల వివరాలు సమగ్రంగా సేకరించాలని పేర్కొన్నారు. సర్వే వివరాలను ఈనెలాఖరు వరకు పూర్తి చేయా లన్నారు. సమావేశంలో శిక్షణ ఐఏఎస్ క్రాంతి, ఆర్డీవో ప్రసూనాంబ, భూముల, కొలతల అధికారి దశరథ్, తహసీల్దార్ శంకర్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహ సీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## 17నుంచి ఎంఆర్ టీకాలు పంపిణీ

### వైరస్‌లను నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యం

ఖమ్మం : ఈనెల 17 నుంచి 25 వరకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను పంపిణీ చేయ నున్నట్లు ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి కొండల్‌రావు తెలిపారు. ఈ ప్రత్యేక టీకా ద్వారా సంబంధిత వైరస్‌లను నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడిం చారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీకా ప్రాము ఖ్యం, పంపిణీ కార్యాచరణపై వివరాలను ఆయన వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నాయని చెప్పారు. మీజిల్స్ కారణంగా ఏటా దేశంలో 40 వేల మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. రూబెల్లా వ్యాధి గర్భిణులకు సోకితే పుట్టబోయే పిల్లలు మానసిక వికలాంగులుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకమైన ఈ వ్యాక్సిన్ పంపిణీ కోసం రెండు నెలల నుంచి జిల్లాలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి సర్వం సిద్ధం చేశామని చెప్పారు.

జిల్లా, మండల స్థాయిలో కమిటీ సమా వేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వయస్సున్న 3,54,621 మంది పిల్లలను లబ్ధిదారులుగా గుర్తించామని వివరిం చారు. నైపుణ్యం కలిగిన సిబ్బంది మాత్రమే వ్యాక్సిన్ పంపిణీ చేయాలని.. అందుకు అవ సరమైన 450 మందికి తర్ఫీదు ఇప్పించామని వెల్లడిం చారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఔషధాన్ని పంపిణీ చేస్తారని ప్రకటించారు. ప్రత్యేక షెడ్యూల్ కార్యాచరణ పూర్తి చేసిన తర్వాత సామూహిక ఇమ్యూ నైజేషన్‌తో పాటు ఈ టీకాను పిల్లలకు అందజేయడం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ పంపిణీ సమయంలో పిల్లలకు ఎలాంటి సమ స్యలు ఎదురైనా వెంటనే చికిత్స అందిం చడానికి అవసరమైన ఏఈఎఫ్ కిట్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈనెల 13న అవగాహన ప్రదర్శనలు నిర్వహించి ప్రజ లకు వివరిస్తామని తెలిపారు.

అనంతరం ప్రచార గోడపత్రికలను ఆవిష్క రించారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, ఆరోగ్యబోధకుడు సాంబశివరెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు

## మర్కగూడలో కేజీబీవీ తరగతులు:డీఈవో

భీంపూర్ : మండలంలోని మర్కగూడలో త్వరలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతులు ప్రారంభిస్తామని డీఈవో లింగయ్య పేర్కొన్నారు. భీంపూర్ మండలానికి మంజూరైన కేజీబీవీని ప్రస్తుతం తాంసి మండల కేంద్రంలోని కేజీబీవీలో కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. మండలవాసులు తరగతులను తమ మండలం లోనే కొనసాగించాలని కోరారు. ఈ మేరకు డీఈవో భీంపూర్ పంచాయతీ పరిధిలోని మర్క గూడలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అక్కడ తరగతుల నిర్వహణకు అనువుగా ఉండటంతో పాటు గ్రామస్థులు తాత్కాలికంగా వసతుల ఏర్పాటుకు ముందుకు రావడంతో తరగతుల నిర్వహణకు చర్యలు తీసు కుంటా మన్నారు.

మండలవాసులు ఈ విషయాన్ని గ్రహించి తమ పిల్లలను 6, 7 తరగతుల్లో చేర్పిం చాలని సూచించారు. బోధన ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్రకాశ్, సర్పంచి మానిక్‌రావు, మాజీ సర్పంచి ధరంసింగ్ పాల్గొన్నారు.

## దోమల నివారణే ప్రభుత్వ లక్ష్యం: డీఎంవో

ఖమ్మం : పజలు, పశువులలో అనేక వ్యాధులకు కారణం అవుతున్న దోమల నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) డా.రాంబాబు తెలిపారు. నగర 13వ డివిజను కొత్తూరు, శ్రీరాంనగర్ పరిసరాలలో పలు ప్రాంతాలలో నిల్వ మురుగు నీటిలో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ నివాసాల చుట్టూ నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల కారణంగా తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల నివారణకు పురుగుమందుల పిచికారీ కారణంగా అనేక ఇతర సమస్యలు ఎదురవుతాయని అన్నారు.

దోమలను ఉత్పత్తి స్థాయిలోనే అడ్డుకునేందుకు తోకపురుగులను తిని జీవించే గంబూషియా చేపలు ప్రత్యామ్నాయంగా వినియోగించడం జరుగుతోందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలలో నిల్వ నీటిలో గంబూషియా చేపలను వదులుతున్నట్లు డీఎంవో వివరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మలేరియా హెల్త్ ఇనస్పెక్టరు వేణుగోపాల్, సిబ్బంది మోతీలాల్ పాల్గొన్నారు.



## ఆడిట్ అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

ఖమ్మం : జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యయం చేసిన సొమ్ముకు లెక్కలు చెప్పలేకపోవటంతో కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున ఆడిట్ అభ్యం తరాలు పేరుకుపోయాయి. ఆడిట్ అభ్యంతరాలు పరిష్కరించుకోవాలని అధికారులు ఎంత మొత్తుకుంటున్నా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపటంలేదు. జిల్లాలోని 427 గ్రామ పంచాయతీల్లో 2015-16 ఆర్థిక సంవత్సరంలో 58,254 ఆడిట్ అభ్యంతరాలను అధికారులు గుర్తించారు. ఈ అభ్యంతరాల విలువ రూ.31.52 కోట్లు. ఇంత సొమ్ము వ్యయం చేసినా కచ్చితమైన లెక్కలు, రశీదులు, తీర్మానాలు మాత్రం పంచాయతీల్లో లేవు. 1999-2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఇదే పరిస్థితి నెలకొంది. రూ.కోట్లు వ్యయం చేసినా కచ్చితమైన లెక్కలు మాత్రం పంచాయతీల రికార్డుల్లో లేవు. జిల్లాలో పేరుకుపోయిన ఆడిట్ అభ్యంతరాలను జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్ లోకేశ్‌కుమార్ సమీక్షించారు. వీటి పరిష్కారానికి జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ఆడిట్ అధికారికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ అభ్యంతరాలను పరిష్కరించుకునేందుకు పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మరో అవకాశం కల్పించారు. ఆయా మండల కేంద్రాలకు ఆడిట్ అధికారులు చేరుకుంటారని సర్పంచులు, కార్యదర్శులు తగిన ఆధారాలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇందులో భాగంగా జిల్లా ఆడిట్ అధికారి యు.రాము, జిలా పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి ఒక షెడ్యూల్ ఖరారు చేశారు. 24న సత్తుపల్లి, 26న మధిర, 29న ఎర్రుపాలెం, 31న కొణిజర్ల మండల కేంద్రాల్లో ఆడిట్ అధికారులు అందుబాటులో ఉంటారని, ఆయా మండలాలతోపాటు సమీప మండలాలకు చెందిన పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తమ రికార్డులు ఆడిట్ అధికారు లకు సమర్పించి అభ్యంతరాలు పరిష్క రించుకోవాలని సూచించారు. గతంలో సూచించిన అభ్యంతరాలకు అనుగుణంగా వాటికి తగు సమాధానాలు అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

## అట్టహాసంగా మంత్రి శిద్దా షష్టిపూర్తి వేడుకలు

ఒంగోలు : రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు షష్టిపూర్తి వేడుకలు అంబరాన్నంటాయి. రెండు రోజులుగా చీమకుర్తి హరిహర క్షేత్రంలో జరిగిన వేడుకలు మూడో రోజు నగరంలోని ఏ-1 కన్వె న్షన్ హాలులో నిర్వహించారు. రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులకు శుభాకాంక్షలు తెలిపేం దుకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. దీనితో గుంటూరు రోడ్డు వాహనాలతో రద్దీగా మారింది. ప్రముఖుల రాకతో పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేడుకలు జరిగిన ప్రాంగణం జనసందోహంతో కిటకిటలాడింది. మంత్రి తనయుడు సుధీర్ బాబు, కోడలు శ్రుతి, కుమార్తె సునీత, అల్లుడు ఫణికుమార్‌లు బంధువులను, అతిథులను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర మంత్రులు సుజయకృష్ణ రంగారావు, పి.నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, అచ్చెన్నా యుడు, కొల్లు రవీంద్ర, జవహర్, గంటా శ్రీనివాసరావు, అయ్యన్నపాత్రుడు, మాజీ మంత్రి పీతల సుజాత, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డి.బాలవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబ శివరావు, ఆమంచి కృష్ణమోహన్, పాల పర్తి డేవిడ్ రాజు, పోతుల రామారావు, గొట్టిపాటి రవి కుమార్, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు (విను కొండ), యరపతినేని శ్రీనివాసరావు (గురజాల), ఎమ్మెల్సీలు కరణం బలరామ క ృష?మూర్తి, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, పోతుల సునీత, బీదా మస్తాన్‌రావు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎన్టీఆర్ తనయుడు నందమూరి హరికృష్ణ, సినీనటుడు గిరిబాబు, జేఆర్ పుష్పరాజ్, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, బీఎన్ విజయకుమార్, అన్నా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### భద్రతారాహిత్యం తగదు

చండీగఢ్‌లో ఐఏఎస్ అధికారి కుమార్తెను బీజేపీ హర్యానా విభాగం అధ్యక్షుడి కుమారుడు, అతడి మిత్రుడు వెంబడించి అపహరణకు ప్రయత్నించడం, అతడి పట్ల పోలీసులు మొదట్లో ఉపేక్ష వహించడం మహిళల భద్రతారాహిత్యానికి అద్దం పడుతున్నది. ఈ నెల నాలుగవ తేదీ శుక్రవారం రాత్రి వర్ణిక కుందు అనే 29 ఏండ్ల యువతి చండీగఢ్‌లోని ఒక ప్రధాన వీధిలో కారు సొంతగా నడుపుకుంటూ తమ ఇంటికి పోతున్నప్పుడు బీజేపీ నేత సుభాష్ బరాలా కుమారుడు వికాస్, ఆయన మిత్రుడు ఆశిష్ ఆమెను తమ కారులో వెంబడించారు. ఆమె కారు ను వేగంగా నడుపుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేసేకొద్దీ, దుండగులు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం వెంటబడ్డారు. వర్ణిక వెల్లడించిన వివరాల ప్రకారం- వారు అమె కారును అనేక చోట్ల అడ్డుకున్నారు. ఒకచోట తమ కారును అడ్డుపెట్టి ఆపగలిగారు. వారిలో ఒకరు ఆమె కారు దగ్గరకు వచ్చి కారు అద్దాలపై కొట్టడమే కాకుండా, తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. వర్ణిక వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తూనే పోలీసులకు సమాచారం అందించడం వల్ల వారు వెంటనే వచ్చి కాపాడారు. పోలీసులు దుండగులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తక్షణం స్పందించి ఆమెను కాపాడటం ప్రశంసనీయమే. వారు సమయానికి రాకపోతే తన పరిస్థితి ఎట్లా ఉండేదోనని బాధితురాలు కూడా అంటున్నారు. కానీ దుండగులను పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయిన తరువాత పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, ఆ తరువాత వారు నిర్వహించిన పాత్ర, కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలకు తావిస్తున్నది. దుండగులు ఒక యువతిని వెంటాడటం, కారు తలుపును తెరిచే ప్రయత్నం చేయడాన్ని బట్టి వారి దురుద్దేశం ఏమిటో తెలుస్తూనే ఉన్నది. కానీ పోలీసులు యువతిని వెంబడించారనే సాధారణ కేసు పెట్టి, వారిని అరెస్టు చేసిన కొద్ది గంటలలోనే బెయిల్‌పై విడుదల చేశారు. ఆ తరువాత కూడా ఆమెను అడ్డుకున్నారు అని మాత్రమే చేర్చారు. తనను అపహరించడానికి ప్రయత్నించారని ఆమె వెల్లడించలేదని పోలీసులు సమర్థించుకున్నారు. కానీ వారు తన కారు తలుపు తెరువడానికి ప్రయత్నించారని, తనను అపహరించాలనేది వారి ఉద్దేశమని స్పష్టమని ఆమె తన రాతపూర్వక ఫిర్యాదులోనే పేర్కొన్నారు. దుండగులు వర్ణికను వెంటాడిన రహదారిపై సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు మొదట అన్నారు. ఈలోగా దుండగుల తరఫున బాధితురాలికి వ్యతిరేకంగా దుష్ప్రచారం మొదలైంది. బీజేపీ నేత ఒకరు ఆ అమ్మాయి రాత్రి పూట బయటకు ఎందుకు వెళ్ళినట్టు అనే రీతిలో వ్యాఖ్య చేశారు. ఆమె ఫేస్‌బుక్‌లో పెట్టుకున్న మిత్రులతో దిగిన ఫొటోలను తప్పుడు అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానిస్తూ సోషల్ మీడియాలో ప్రచా రం సాగింది. ఇంతలో నాయకులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పత్రికల్లో, టీవీల్లో ప్రచారమై, ఒత్తిడి రావడంతో పోలీసులు తప్పనిసరై అపహరణ యత్నం అని చేర్చి నాన్‌బెయిలబుల్ కేసు పెట్టి వారిని అరెస్టు చేశారు. సీసీటీవీ దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. వాటిలో వర్ణిక కారును దుండగుల కారు వెంటాడుతున్నట్టు స్పష్టంగా ఉన్నది. అయితే ఆమెను అడ్డుకున్న చోట మాత్రం కెమెరాలు పనిచేయడం లేదని అంటున్నారు. దుండగులను అరెస్టు చేసినప్పుడు వచ్చిన వైద్యుడు వారి నోటి నుంచి మద్యం సేవించిన వాసన వస్తున్నదని వెల్లడించారు. అయితే రక్త పరీక్ష చేయించు కోవడానికి వారు నిరాకరించారు. వారు మద్యం కొనుక్కున్న దృశ్యాలు కూడా లభ్యమయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనాలను కూడా పోలీసులు సేకరించారు. యువతిపై అఘాయిత్యానికి పాల్పడటం సాధ్యం కాలేదు కానీ, వారికి ఆ ఉద్దేశం ఉన్నదనే ది స్పష్టం. బాధితురాలు ఒక ఉన్నతాధికారి కుమార్తె కనుక ధైర్యంగా నిలబడి న్యాయం కోసం పోరాడుతున్నారు. కానీ బీజేపీ హర్యానా శాఖ అధ్యక్షుడు తన కుమారుడికి అండగా నిలబడినందుకు, పార్టీ ఆయనను తప్పుపట్టడం లేదు. మొదట్లో పోలీసులు వారికి అనుకూలంగా వ్యవహరించారు. చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం అయినందు వల్ల అధికార యంత్రాంగం కేంద్రం అజమాయిషీలో ఉంటుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వమైనా వెంటనే స్పందించి, అనుమానాలకు తావులేకుండా వ్యవహరించవలసింది. తమది భిన్నమైన పార్టీ అని బీజేపీ నేతలు అధికారంలోకి రాకముందే తరచు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు కొడుకు చేసిన తప్పు కు తండ్రిని తప్పుపట్టడమేమిటని అంటున్నారు. నిజమే కానీ, రాజకీయ నాయకులు ఆదర్శ ప్రవర్తన కలిగి ఉండాలె.

# శరద్ యాదవ్‌కు నితీశ్ ఝలక్



ఢిల్లీ: జనతా దళ్(యునైటెడ్) మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత శరద్ యాదవ్‌కు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గట్టి ఝలక్ ఇచ్చారు. రాజ్యసభలో పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న శరద్ ఆ బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు జేడీయూ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ స్పీకర్ అయిన వెంకయ్యనాయుడుకు పార్టీ సమాచారాన్ని తెలియజేసింది. అంతేకాదు కొత్త ప్రతినిధిగా నితీశ్ సన్నిహితుడు ఆర్‌సీపీ సింగ్ పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. ఇంతకు ముందు మరో రాజ్యసభ సభ్యుడు అన్వర్ అలీపై కాంగ్రెస్ నిర్వహించిన బీజేపీ వ్యతిరేక సమావేశంలో పాల్గొనటంతో వేటు వేసిన విషయం తెలిసిందే. మొత్తం జేడీయూ తరపున పార్లమెంట్‌లో ఇద్దరు లోక్ సభ ఎంపీలు, ఆరుగురు రాజ్యసభ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన మద్దతుదారులను సేకరించే పనిలో భాగంగా రాష్ట్రవ్యాప్త పర్యటనకు శరద్ సిద్ధమవుతున్న వేళ తాజా వేటుతో కొత్త పార్టీ ఏర్పాటు దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది.

# కేడీసీసీబీకి జాతీయ స్థాయిలో ప్రథమ అవార్డు

కరీంనగర్ : బ్యాంకు పరిపాలన రంగంతో పాటు రుణాల మంజూరు, వసూళ్లు ఇతర అంశాల్లో ప్రగతి సాధించినందుకు దేశంలోనే కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అత్యుత్తమ బ్యాంకుగా సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య చెన్నైలో ప్రకటించింది. రెండు రోజులు జరిగిన సదస్సులో శుక్రవారం మధ్యాహ్నం ఈ అవార్డును తమిళనాడు రాష్ట్ర సహకార మంత్రి సెల్లూరు కె.రాజు, ఆర్థికశాఖ మంత్రి డి.జయకుమార్ చేతుల మీదుగా కేడీసీసీబీ జిల్లా ఛైర్మన్ రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు జిల్లా బ్యాంకు సీఈవో సత్యనారాయణరావుకు అందజేశారు. ఏటా జాతీయ సమాఖ్య సమావేశానికి దేశంలోని సహకార బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, గ్రామస్థాయిలో సహకార సంఘం, బ్యాంకుల ద్వారా అందించే సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో అవార్డులు ఇస్తారు. ఈ ఏడాది జిల్లా బ్యాంకుకు ప్రథమ అవార్డు లభించింది. ఈ అవార్డును తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి చేతులమీదుగా అందుకోవాల్సి ఉండగా ముఖ్యమంత్రి ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వెళ్లారు. దీంతో ఒకరోజు ముందే గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఛైర్మన్ రవీందర్‌రావును ఈ విషయమై ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రత్యేకంగా సన్మానించారు.

బ్యాంకు పనితీరు ఇలా : 2012-13 నుంచి ఐదేళ్లలో డిపాజిట్లు రూ.339 కోట్ల నుంచి రూ.963 కోట్ల వరకు పెరిగాయి. రుణాలు రూ.560 కోట్ల నుంచి రూ.980 కోట్లకు పెరగడమే కాకుండా వసూలు 99 శాతం ఉందని బ్యాంకు ఛైర్మన్ రవీందర్‌రావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

# యోగి సర్కారుపై మండిపడ్డ అఖిలేశ్!



గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇలాకాలోని బీఆర్డీ ప్రభుత్వ దవాఖానాలో పెద్దసంఖ్యలో చిన్నారులు చనిపోయవడంపై మాజీ సీఎం, ప్రతిపక్ష నేత అఖిలేశ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. యోగి సర్కారు వైఫల్యానికి ఈ ఘటన నిదర్శనమని మండిపడ్డారు. 'బీయార్డీ మెడికల్ కాలేజీలో మరణాలపై యోగి సర్కారు నిజాలను వెల్లడించడం లేదు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ప్రతినిధుల బృందం ఆస్పత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితిని వెలికితీసి.. ప్రభుత్వానికి తెలియజేయనుంది' అని చెప్పారు. 'రాష్ట్ర ప్రభుత్వం తన విధులను తాను నిర్వర్తించకుండా ఎస్పీ కార్యకర్తలను వెంటాడే పనిలో నిమగ్నమైంది. బరేలీ, బాలియాలలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనం' అని అఖిలేశ్ విమర్శించారు.

గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన పిల్లల సంఖ్య 63కు పెరిగింది. ఆస్పత్రిలో ద్రవరూప ఆక్సిజన్ అందుబాటులో లేని కారణంగానే వీరంతా మృత్యువాత పడ్డారు. ఆగస్టు 9 నుంచి 11 వరకూ చోటుచేసుకున్న ఈ మరణాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఆక్సీజన్, వైద్యం అందక చిన్నారులు చనిపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# 'రాత్రికి రాత్రే యుద్ధానికి సిద్ధం'

న్యూజెర్సీ: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటలతో ఉత్తరకొరియాను లొంగదీయాలనే ఆలోచనను మానుకోవడం లేదు. తాజాగా ఆయన ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌కు అల్టీమేటం జారీ చేశారు. అమెరికాను ఢీ కొట్టి నిలవాలనే ఆలోచన ఉత్తరకొరియా మానుకోవాలనే దిశలో ట్రంప్ ప్రసంగం సాగింది. ఒకవేళ ఉత్తరకొరియా గ్వామ్‌పై దాడి చేస్తే రాత్రికి రాత్రే యుద్ధానికి సిద్ధమంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వెనిజులా సంక్షోభంపై మిలటరీని ప్రయోగించాలని భావిస్తున్నట్లు కూడా ట్రంప్ ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా ప్రపంచమార్కెట్లు కుదేలయ్యాయి. యుద్ధ భూతం రెక్కలు విప్పుకుంటుందేమోననే నిపుణుల సందేహాలు మరింత భయాందోళనలను పెంచు తున్నాయి. కొరియన్ మీడియా అయితే యుద్ధం జరిగితే తమ ప్రాంతం నాశనం అవుతుందని ఆందోళన వెలిబుచ్చింది. ట్రంప్ సంయమనంతో మాట్లాడాలని కోరింది. గ్వామ్ ద్వీపానికి ఏదైనా జరిగితే ఉత్తరకొరియాపై అణుదాడికి బీ-1బీ సూపర్‌సోనిక్ విమానాలు పసిఫిక్ మహాసముద్రంలో సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ చెప్పారు. అయితే, ట్రంప్ న్యూజెర్సీలో ఈ ప్రకటన చేసే ముందు వరకూ ఉత్తరకొరియా సముద్రజలాల్లో అమెరికా నేవీ లేదా వాయుదళానికి చెందిన హడావుడి ఏదీ కనిపించలేదు. కానీ, యుద్ధానికి తాము సన్నద్ధంగా ఉన్నామని ట్రంప్ చెప్పడం వింతగా అనిపిస్తోంది. ఎలాంటి హడావుడి లేకుండానే అమెరికా అన్నింటిని సమకూర్చుకుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ట్రంప్ వ్యాఖ్యలు కిమ్‌ను మాటలతో మెడలు వంచడానికేనని తెలుస్తోంది. ఇలాంటి వ్యాఖ్యలు ఆందోళనకర పరిస్థితులకు దారి తీస్తున్నాయి.

## కవి సమయం

### మలినం లేని మనిషి

మలినం లేని మనిషికి మాధుర్యం చిలికింది
కరాబు లేని మనసుకు ఖరీదు యెంతుంది
నబాబు గారికి 'సలామ్' చేసే మనసుంది
హత్తుకు పోయే మనసుకు
ప్రేమే సమాజ మంటుంది.
తలారులైనా... బికారులైనా...
తపస్సు చేసే మనిషికి ప్రేమతో మనసుంది
కసింత మనసున్నా...
మరింత మనసున్నా...
కబీరు ప్రేమే పరమాత్మ అంటుంది;
కబీరు ప్రేమే లోకంలో ఉంటుంది.
ఖజాన విలువుంది - భోగాలంటుంది
మనసున నిలిచే - దైవం ఏమంది;
భుజాన మోసే మనిషికి - బరువే కానుంది
శ్రమతో మనిషికి - దైవం తోడుంది.
ప్రేమ మనసుతో త్యాగం చేసి,
మనిషే సజీవి ఏసు;
చిరునగవులు చిందించి,
శ్రీ కృష్ణుని ప్రేమే సెలయేరు;
సేవకు శ్రమించి - థెరీస మహతల్లి
పునీత పుడమిన పుట్టిన భాగ్యం - ప్రేమను చూపించి.

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం.9290839512

## పంచాంగం

మాసం : శ్రావణ : షష్ఠి రా.7.55;
అశ్విని తె.4.30; రా.వ.12.39ల 2.12

శనివారం
13-08-2017

**మేషం :** ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్ధలు సమసిపోతాయి. వైద్య రంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి. **వృషభం :** ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకటుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. మీ సంతానం కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగంలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మిథునం :** ఉపాధ్యా యులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. మానసిక ఆందోళనవల్ల పెద్దల ఆరోగ్యం విషయంలో సంతృప్తి కానరాదు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. **కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు వాయిదా పడ తాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. **సింహం :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయ మనం పాటిం చండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తా లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. కట్టడాల అక్రమాల నిర్మాణంలో సమస్యలను ఎదుర్కొంటారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. **కన్య :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **తుల :** స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు. **వృశ్చికం :** కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. **ధనుస్సు :** ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.. **మకరం :** ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. **కుంభం :** గృహంలో నూతన వస్తువులను అమర్చు కోగలుగుతారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. **మీనం :** ప్రింటింగ్ రంగాల వారికి బకా యిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది.

## సంకీర్తన

### కష్టాలు తీర్చు కాలాంజనేయుడు



ఆయా క్షేత్రాలలో .. వివిధ రూపాలలో పూజలు అందుకుంటూ ఉంటాడు. భక్తాంజనేయుడు .. దాసాంజనేయుడు .. యోగాంజనేయుడు .. ప్రసన్నాంజనేయుడుగా ఆయన భక్తులచే పూజాభిషేకాలు అందు కుంటూ ఉంటాడు. అలాంటి హనుమంతుడు 'కాలాంజనే యుడు'గా పూజలు అందుకునే ఆలయం హైదరాబాద్ - అత్తాపూర్‌లోదర్శనమిస్తుంది. ప్రాచీనకాలం నాటి 'అనంత పద్మనాభస్వామి' ఆలయ ప్రాంగణంలో కాలాంజనేయస్వామి కొలువుదీరి కనిపిస్తుంటాడు. అక్కన్న - మాదన్నలు ఈ ఆలయాన్ని నిర్మించి నట్టుగా చెబుతారు. ఇక్కడ హనుమంతుడు నల్లని రూపంలో దర్శనమిస్తూ ఉంటాడు గనుక, కాలాంజనేయస్వామిగా పిలుస్తుంటారు. స్వామివారికి సిందూరం కాకుండా సంపెంగ తైలం పూయడం ఇక్కడి ప్రత్యేకత. స్వామివారు ఇరువైపులా శంఖు చక్రాలు కలిగి ఉండటం విశేషం. ఇక్కడి స్వామి వారిని పూజించడం వలన .. అంకితభావంతో ఆయనని సేవించడం వలన కష్టాలు తొలగిపోతాయని భక్తులు చెబు తుంటారు. దోషాలు .. పాపాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు చేకూరతాయని విశ్వసిస్తుంటారు.

### శని ప్రభావాన్ని తొలగించే శివుడు

సాధారణంగా కొన్ని శైవ క్షేత్రాలలో రాహు .. కేతు సంబంధమైన పూజలు, శని ప్రభావాన్ని తొలగించే పూజలు జరుగుతుంటాయి. అలాంటి ప్రాచీనమైన క్షేత్రాలలో ఒకటిగా ఆదిలాబాద్ జిల్లాలోని 'సిరిచెల్మ' దర్శనమిస్తుంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడని స్థలపురాణం చెబుతోంది. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా తిరుగాడటం జరిగిందని చెబుతుంటారు.ఈ గ్రామస్తులంతా స్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించేవారట. అలాంటి గ్రామం ఒకసారి తీవ్రమైన కరువు బారినపడటం జరిగింది. ఎక్కడా నీళ్లు లేకపోవడంతో, గ్రామస్తులకు ఏం చేయాలో పాలుపోక ఆందోళన చెందసాగారు. అలాంటి పరిస్థితుల్లో స్వామివారు ఒక బాలుడి రూపంలో వచ్చి వాళ్లకి ధైర్యం చెప్పాడు. ఆ తరువాత తెల్లవారేసరికి స్వామి ఆ గ్రామంలో పెద్ద చెరువును తవ్వాడు. అప్పటి నుంచి ఆ చెరువు వాళ్ల జీవనాధారంలో ప్రధాన భాగమైంది.స్వామివారు ప్రత్యక్షంగా వచ్చి తమ కష్టాలను తీర్చాడు కనుక, అందుకు కృతజ్ఞతగా ఆ గ్రామ స్తులు ఆయనని అను నిత్యం సేవిస్తూ వస్తు న్నారు.

తమ గ్రామాన్ని సదారక్షి స్తున్నవాడు ఆ సదా శివుడేనని విశ్వసిస్తుం టారు. ఆయా పుణ్య తిథుల్లో ఆయనని మరింతగా సేవించి తరిస్తుంటారు. స్వామిని ఆరాధించడం వలన సమస్త పాపాలు .. దోషాలు నశిస్తాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల పునరుజ్జీవం జరగాల్సిందే

## ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి



వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులకు కేటాయించిన నీటికనుగుణంగా ఆయా ప్రాజెక్టుల పునరుజ్జీవానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేదాకా విశ్రమించబోమని ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి అన్నారు. ఆర్డీఎస్ జూరాల ప్రాజెక్టుల పునరుజ్జీవానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ వనపర్తిలో ఒకరోజు నిరసన దీక్ష శిబిరం ముగింపు సందర్భంగా ఆయన స్వగృహంలోనిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టులపై తనకు అవగాహన లేదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడారని.. ఉమ్మడి జిల్లా ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఆయన విమర్శలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు పెద్ద ప్రాజెక్టులను రూ.6500 కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌తో తనకున్న చనువుతో సాధించానన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. అప్పట్లోనే చేపట్టిన ప్రాజెక్టుల కాలువలకు రంధ్రాలు పెట్టి అక్కడక్కడా చెరువులకు నీళ్లు నింపుతూ.. తామే ప్రాజెక్టులను సాధించామని అధికార పార్టీ నాయకులు వక్రీకరించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాలకు ప్రస్తుతం తాగునీరందుతుందంటే అందులో తన శ్రమ దాగి ఉందన్నారు. అధికారంలో ఉన్న తెరాస నాయకులు మూడేళ్లలో ఏమి సాధించారో చెప్పాలన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులన్నీ టీఎంసీ నీటికి పదివేల ఎకరాలకు సాగునీరందే చర్యలు తీసుకున్నారని, దీన్ని సైతం వక్రీకరించి 6500 ఎకరాలకు మాత్రమే అందుతుందని నిరంజన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలోని పలు రిజర్వాయర్ల లిఫ్టులు తన చొరవతోనే ఏర్పాటయ్యాయన్న నిజాన్ని మరచిపోరాదన్నారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టుల పునరుజ్జీవానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణపై వివక్షతోనే పట్టింపులు లేవన్నారు. సీఎంతో అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పుకునే ఈ ప్రాంత అధికార పార్టీ నాయకుడు పలుకుబడిని ఉపయోగించి నీటి కేటాయింపులకు అనుగుణంగా అనుమతులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో ఎంపీటీసీ సభ్యుల చేరిక..

వనపర్తి మండలంలోని కాశింనగర్, నాగవరం ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ, నారమ్మతోపాటు నాయకులు రాములు, లాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వానికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం శాసనసభ్యుడు జి.చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి తెరాసలో చేరిన వీరు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెరాసలో న్యాయం జరగకనే తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వసతి గృహం వార్డెన్‌పై విచారణ

దామరచర్ల : సన్నబియ్యం పక్కదారి పట్టించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దామర చర్లలోని ఎస్టీ బాలుర వసతిగృహం వార్డెన్ బాలకృష్ణపై అధికారులు విచారణ జరుపుతున్నారు. మూడ రోజుల క్రితం తహసీల్దార్ గణేష్, ఎస్సై శ్రీకాంత్ హాస్టల్ వద్ద కు వెళ్లగా రికార్డు గదికి తాళం వేసి ఉండటం, వార్డెన్ అప్పటికప్పుడు సెలవులో వెళ్లడంతో గదికి సీలు వేశారు. శుక్రవారం వార్డెన్ నుంచి తాళంచెవి తెప్పించుకున్న అధికారులు తలుపులు తెరిచి అందులో ఉన్న దస్త్రాలను పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థుల సంఖ్య నమోదును అధికంగా చూపుతున్నట్లు వార్డెన్‌పై ఆరోపణలు వస్తుండటంతో విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా అధికారులు వస్తున్నారనే సమాచారం అందడంతో వసతి గృహంలో పేర్లు నమోదైన వారిని ఇక్కడికి తీసుకువచ్చేందుకు సిబ్బంది శ్రమించారు. కొండ్రపోల్ జడ్పీ ఉన్నతపాఠశాలలో చదువుతున్న 50 మందిని రప్పించారు. హాస్టల్‌లో 350 మంది పేర్లు నమోదు చేసినప్పటికీ ట్రంకుపెట్టెలు 120 మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది.

వార్డెన్ సెలవులో ఉండటంతో తాత్కాలిక బాధ్యతలను ఎస్సీ హాస్టల్ వార్డెన్ జగన్మోహన్‌రాజుకు అప్పగించారు. ఇతను ఇప్పటికే మూడు హాస్టళ్లకు వార్డెన్‌గా వ్యవహరిస్తున్నారు.

గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన ఎస్టీ బాలుర వసతిగృహంలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తుండగా ఆశాఖ కు చెందిన అధికారులు ఇంతవరకు పరిశీలన చేయకపోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. విచారణలో ఆర్ఐ సైదులుతో పాటు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# అన్నదాతలు ఆదాయ వనరులను ఎంచుకోవాలి

## ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వేణుమాధవ్

మహబూబ్‌నగర్ : అన్నదాతలు కేవలం వ్యవసాయం మీద ఆధారపడకుండా అదనపు ఆదాయ వనరులను ఎంచుకోవాలని భారతీయ స్టేట్ బ్యాంకు చీఫ్ మనేజర్ వేణుమాధవ్ సూచించారు. దీనికి బ్యాంకులు తమ వంతు సహకారం ఇస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలోని ఏడీబీలో ఏర్పాటు చేసిన రైతుమహాసభలో చీఫ్‌మేనేజర్ వేణుమాధవ్ మాట్లాడారు. గొర్రెలు, గేదెలు, చేపలు, కోళ్ల పెంపకంతో జీవనోపాధి పొందవచ్చని సూచించారు. దీని కోసం రూ.2 కోట్లు రునాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏడీబీ ఆధ్వర్యంలో రూ.1.02 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాల కొనుగోలుకు కూడా ఆర్థిక సాయం ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అందించిన సేవలను బ్రాంచి మేనేజర్ శివరామాంజనేయులు వివరించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ గ్రామీణ వ్యవసాయ అధికారి సుల్తానా తదితర అధికారులు, వివిధ గ్రామాల రైతులు, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలక్ష్మి సంఘాలకు ట్రాక్టర్ల కొనుగోలు కోసం రుణాలను అందించారు.

# పరిశుభ్రత పాటించాలి

రామాయంపేట: చిన్నారులకు పాలు ఇచ్చే సమయంలో తల్లులు పరిశుభ్రత పాటించాలని మహిళా, శిశు జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని రామాయంపేటలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. పోతపాల వల్ల సమస్యలు తలెత్తినట్లు శాస్త్రీయంగా రుజువైందన్నారు. తల్లిపాల వారోత్సవాలను ఒక అవకాశంగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో తల్లి పాలు ఇచ్చే సంస్కృతిని పెంచాలని కోరారు. లేకపోతే ఒక నెరవేరని కలగానే మిగిలిపోతుందన్నారు. అనంతరం ఉత్తమ అత్త, భర్తలకు అవార్డులు అందజేశారు. రామాయంపేట పరిధిలోని కోమటిపల్లికి చెందిన ఉత్తమ అత్తగా కమలమ్మ, భర్తగా దాసు, శంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన లక్ష్మి, యాదగిరి, చేగుంట మండలం బోనాలకు చెందిన కమల, రాంపూర్‌కు చెందిన రమేష్, వెల్దుర్తికి చెందిన లక్ష్మి, రమేష్‌లు ఉత్తమ అత్త, భర్తలుగా అవార్డులు అందుకున్నారు. సీడీపీవో జ్యోతిర్మయి, పర్యవేక్షకులు సన్వేరా, జయంతి, శారద, అనురాధ, ఏపీఎం సత్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

నర్సాపూర్: నేరెళ్లలో దళితులపై దాడులకు పూర్తి బాధ్యత వహిస్తూ రాష్ట్రమంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే మల్లేశ్ డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దళితుల అవగాహన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై థర్డ్ డిగ్రీ విచారణలో అక్కడి జిల్లా ఎస్పీని సస్పెండ్ చేయాలని కోరారు. నేరెళ్లలో ఇసుక మాఫియా ఆగడాలు అధికమయ్యాయని, ముఖ్యంగా దళితులకు రక్షణ కరవె%ందని వాపోయారు. ఇసుక లారీల ప్రమాదాల్లో ఎంతో మంది మృతి చెందారని వారిని ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక దళితులపై దాడులు, దౌర్జన్యాలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గోరక్షణ పేరుతో సంఘ్ పరివార్ దళితులపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 7500 మందిపై దాడులు జరిగాయన్నారు. దాడులను ఎదుర్కొనేందుకు ఎర్రజెండాలు, నీలి జెండాల శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ.. దళితుల సామాజిక న్యాయం, సమగ్రఅభివృద్ధి జరగాలన్నారు. విద్య, వె%ద్యం రంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. సీపీఐ జిల్లా బాధ్యులు ఆదిరెడ్డి మాట్లాడుతూ.. దళితులపై దాడులు, దౌర్జన్యాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, సహాయ కార్యదర్శి ఖాలెక్, జిల్లా నాయకులు గణేశ్, దుర్గయ్య, నందం తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటమే లక్ష్యం

నల్గొండ : తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆసంస్థ ఛైర్మన్ జి.నాగేందర్‌గౌడ్ చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సంస్థ ద్వారా రూ.100 కోట్ల మౌలిక వసతుల కల్పన పనులు చేపడతున్నామన్నారు. శుక్రవారం నల్గొండలోని కలెక్టరేట్‌లో సంస్థ సమీక్ష సమావేశంలో, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకే రాష్ట్రంలో ప్రభుత్వం పెద్దఎత్తున గురుకులాలు ఏర్పాటు చేసిందని వివరించారు. సీఎం కేసీఆర్, విద్యాశాఖమంత్రి ఆధ్వర్యంలో మౌలిక సదుపాయల కల్పనకు శ్రీకారం చుట్టామని చెప్పారు.

గత ప్రభుత్వాలు విద్యను వ్యాపారమయం చేశాయని ఆరోపించారు.

సంస్థ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ టి.విజయ్‌కుమార్, సీఈ మల్లేశం, ఎస్‌ఈ నందకుమార్, ఈఈ శైలెందర్‌రాజు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఈ.విజయ్‌కుమార్, డీఈ శైలజ, అక్రంబాబా, శ్రీను తదితరులు పాల్గొన్నారు

# ప్రతి విద్యార్థి చదువులో ముందుండాలి

నర్సాపూర్ : ప్రతి విద్యార్థి చదువులో ముందుండాలని జిల్లా విద్యాధికారి సరోజినిదేవి సూచించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అభ్యాసన ప్రక్రియలను పరిశీలించారు. విద్యార్థులకు పరీక్షలు పెట్టి వారు ఎలా రాస్తున్నారని చూడటంతో పాటు వారితో చదివించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అందరికి చదవడం, రాయడం వచ్చేలా చూడాలని సూచించారు. గణితం నేర్పించాలన్నారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని స్పష్టంచేశారు. అన్ని గదులను తిరిగి చూశారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

## పీయూ ఉప కులపతి ఆచార్య రాజారత్నం




మహబూబ్‌నగర్ : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాజారత్నం సూచించారు. జిల్లా కేంద్రంలో ఎంవీఎస్, ఎన్టీఆర్, ఆదర్శ, స్వామి వివేకానంద డిగ్రీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కారణంగా పిల్లల్లో అనేక మార్పులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారని అన్నారు. అంతర్జాలం, సామాజిక మాధ్యమాలను విజ్ఞానం పెంచుకునేందుకు వినియోగించాలని సూచించారు. స్నేహితులను ఎంపిక చేసుకునే సమయంలో కూడా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చదువులో ఎలా ఉంటారు? వ్యవహారశైలి వంటివి పరిశీలించి స్నేహం చేయాలని అన్నారు. ఎవరైన తప్పుడు మార్గంలో వెళ్తుంటే వారిని సన్మార్గంలో పెట్టేందుకు ప్రయత్నించాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం అప్పుడప్పుడు కళాశాలలకు వెళ్లి పిల్లల చదువు, వ్యవహారశైలి గురించి అధ్యాపకుల వద్ద ఆరా తీయాలని చెప్పారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. కళాశాలలు సైతం బాధ్యతగా తీసుకొని విద్యార్థులు సన్మార్గంలో ఉండేలా ప్రయత్నించాలని కోరారు. స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీనాథచారి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త అనూరాధ, స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హీరోజీరావ్ భోంస్లే, ఎన్‌సీసీ అధికారి విజయ్‌కుమార్, డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సుభాషిణి, శంకర్, శ్రీపతినాయుడు, రాఘవేందర్, అరుంధతి, మెర్సీ వసంత తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



మెదక్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రద్ధగా చదువుకోవాలని, ఎట్టి పరిస్థితిలో మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి నర్సింలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గీతా జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులకు ఇంటర్ ఫలితాలు ఎంతో కీలకమని, అందుకే అన్ని పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించడం ద్వారా ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేందుకు కళాశాల ప్రారంభం నుంచే ప్రణాళికతో చదవాలని ఉద్బోధించారు. మెదక్ పురపాలిక అధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తెరగాలని సూచించారు.

మంచి నాయకత్వ లక్షణాలను పెంపొందింప జేసుకోవాలని చెప్పారు. స్థానిక కౌన్సిలర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ తరుణంలో భావోద్వేగాలను పక్కనపెట్టి చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గడిచిన విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఉత్తమ మార్కులు సాధించిన శ్రీశైలం, బైపీసీ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రవీణ్, హర్షిత, చె%తన్య, వాజిద్, సౌమ్య, నాగమణి, మౌనికలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, ఛైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ శ్రీశైలం, వైస్‌ప్రిన్సిపల్ రాము, అధ్యాపకులు రామారావు, మల్లేశం, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 16న రైతు సమస్యలపై దేశవ్యాప్త నిరసన

పాలమూరు : దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారస్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడిని కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయించాలన్నారు. ప్రైవేట్ అప్పులతో సహా రైతులు తీసుకున్న అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలన్నారు. పశు విక్రయంపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, గో సంరక్షణ పేరుతో ముస్లింలు, దళితులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూ సేకరణను ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసి, బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

రామాయంపేట: కల్లుగీత కార్మికుల వృత్తి రక్షణకై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరిస్తుందని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గౌడ్ వాపోయారు. శుక్రవారం రామాయంపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించలేదని, గౌడ సామాజిక వర్గీయుల అణిచివేతలో భాగంగానే వృత్తిపై అప్రకటిత నిషేధాన్ని కొనసాగిస్తుందని విమర్శించారు.

వృత్తి కోల్పోయిన వారికి వందశాతం మద్యం దుకాణాలను కేటాయించాలని, ట్యాంకుబండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై గౌడకులస్తులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్, అధికార ప్రతినిధి బాల్‌రాజుగౌడ్, కోశాధికారి బొమ్మ నర్సాగౌడ్, నగేష్‌గౌడ్, హన్మంతగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులందరికీ రుబెల్లా వ్యాక్సిన్ : డీఈవో

వీరన్నపేట : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులందరికీ మిజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ వేయించాలని జిల్లా విద్యశాఖ అధికారి సోమిరెడ్డి కోరారు. డీఈవో కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 17 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని సూచించారు. టీకాపై అపోహలు ఉన్నాయని, ఇవి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వచ్చిన సమయంలో పూర్తి సహకారం ఇవ్వాలని కోరారు. పాఠశాలలు ఇన్‌స్పైర్(స్ఫూర్తి) అవార్డుకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఫీజుల విషయంలో ఇబ్బందులు పెట్టవద్దని, ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి శరత్‌చంద్ర, ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు లక్ష్మణ్, ప్రభాకర్, లక్ష్మణ్‌గౌడ్, మల్లేష్, చల్మారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

నిజాంపేట : సెప్టెంబరు 17న తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించడంతో పాటు నిర్వహించాలని భాజయుమో జిల్లా అధ్యక్షులు నవీన్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ విషయమై నిజాంపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతప్రజల ఆత్మభిమానానికి గుర్తుగా నిజాం నిరంకుశ పాలనకు ఆనాటి ప్రజలు చేసిన సాయుధ పోరాటాన్ని చరిత్రలో నిలిపే విధంగా కార్యక్రమాన్ని జరిపించాలన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# పురుషుల్లో కొవ్వు తగ్గాలంటే ఇవి పెట్టండి?



పురుషులు సాధారణంగా కఠినమైన ఆహార ప్రణాళికలు ఆచరించరు. బదులుగా మేము వ్యాయామాలు చేస్తూ బరువు తగ్గించుకుంటామంటారు. కఠినమైన ఆహార నియమాలు పాటించలేనివారు తమ అదనపు కొవ్వు తేలికగా కరిగించుకొని స్మార్ట్ అయిపోవాలంటే క్రింద పేర్కొన్న ఆహారాలు సహకరిస్తాయి.

ఆపిల్స్ - రోజుకు ఒక ఆపిల్ తింటే....డాక్టర్ అవసరం లేదంటారు. అది నిజమే. మీరు ఆరోగ్యంగా వుండాలంటే బరువు తగ్గాలంటే ప్రతిరోజూ మీ ఆఫీస్ కు వెళ్ళేటపుడు ఒక ఆపిల్ తినేయండి. ఆపిల్ ను పాలు లేదా పెరుగుతో జతచేసి కూడా తింటే రుచి మరింత పెరుగుతుంది. ఆపిల్ మీ రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు తగ్గించటమే కాదు కరిగే పీచు కూడా కలిగి వుంటాయి. ఆపిల్స్ లో వుండే పెక్టిన్ శరీరంలోని అధిక నీటిని, కొవ్వును పీల్చేస్తుంది. అంతేకాదు ఆపిల్ మీకు తినాలనే వాంఛను కూడా తగ్గించి కొవ్వు కరిగేందుకు తోడ్పడుతుంది.

నిమ్మ పండు - నిమ్మ పండ్లలో విటమిన్ సి అధికం శరీరంలోని కేలరీలు ఖర్చు చేస్తుంది. పురుషులు నిమ్మ, ఆరెంజ్, బెర్రీ, ద్రాక్ష వంటి పండ్లు తింటే అదనపు కొవ్వు కరిగి పోతుంది. నిమ్మ బరువును సహజంగా తగ్గిస్తుంది.

గ్రీన్ టీ - చాలామంది కేఫైన్ బరువు వేగంగా తగ్గిస్తుందంటారు. ఆఫీసులో ఒకసారి కాఫీ తాగేసి బరువు తగ్గుతామని పురుషులు భావిస్తారు. రీసెర్చి మేరకు కాఫీ గుండె తీరును వేగం చేస్తుంది. కొవ్వు వేగంగా కరిగిస్తుంది. అయితే, కేఫైన్ తో పోలిస్తే గ్రీన్ టీ అధిక ప్రయోజనం. బరువు తగ్గిస్తుంది. ఆకలి నియంత్రిస్తుంది ఆరోగ్యంగా వుండేలా చేస్తుంది. బరువు తగ్గటమే కాక, ఈ హెర్బల్ టీ మీ చర్మానికి, వెంట్రుకలకు కూడా చాలా మంచిది. మరి ఒత్తిడితో జుట్టు ఊడుతుంటే, మీరు నల్లబడిపోతుంటే గ్రీన్ టీ తాగండి.

బాదం పప్పులు -బాదం పప్పు, వాల్ నట్, అప్రికాట్ వంటివి మంచి కొవ్వు కలిగించి, మంచి కొల్లెస్టరాల్ ఇస్తాయి. ఆకలి నియంత్రించాలన్నా, కడుపు నిండుగా వుంచుకోవాలన్నా ప్రతిరోజూ గుప్పెడు బాదంపప్పులు తినండి.

గుడ్లు - మీరు మాంసాహారి అయితే, గుడ్డును పూర్తిగా మీ బరువు తగ్గేందుకు వినియోగించండి. గుడ్లు ఆరోగ్యమే కాదు తేలికగా కడుపు నింపుతాయి. వాటిని ఉడికించి లేదా అతికొద్ది నూనెలో వేయించి ప్రతిరోజూ బ్రేక్ ఫాస్ట్ గా తినండి. గుడ్లను వెన్నతీసిన పాలతో కూడా తినవచ్చు.

ఈ అయిదు రకాల ఆహారాలు పురుషులలో కల అధిక శరీర కొవ్వును కఠినమైన ఆహార ప్రణాళికలు ఆచరించకుండానే కరిగిస్తాయి. కనుక ఈ ఆహారాలు మీ ఆహారాలలో చేర్చి ఆరోగ్యంగా, చురుకుగా, ఫిట్ గా వుండేలా చేసుకోండి.

# మీ పిల్లలలో సృజనాత్మకత త్వరగా పెంచండి!

పిల్లలు చిన్న వయసులో వుండగానే వారిలో ఆలోచనా పరిధి పెరుగుతుంది. ఆటపాటలతో, మంచి విద్యాబుద్ధులతో వీరిలో సృజనాత్మకత పెంచవచ్చు. మీ చిన్నారులకు చిన్నతనంనుండే తమలోని ఊహా శక్తిని అధికం చేసుకునేందుకు అవకాశం ఇవ్వండి. వారి మనసులలోని విషయాలను ఊహలను ఏ రకంగా పెంచి వారిని స్వతంత్రులుగాను మంచి పౌరులుగాను తీర్చిదిద్దడమెలా? అనేది పరిశీలిద్దాం.

***ఒక కథ చెప్పండి*** - ఊహా శక్తి పెరగటానికి గాను పిల్లలకు కథలు చెప్పాలి. సాధారణంగా పిల్లలకు కథను మించిన సాధనం లేదు. కథలే పిల్లలకు ప్రపంచం అంటే ఏమిటో తెలియజేస్తాయి. బొమ్మలు, విద్యాపర ఛార్టులు, ఇతర ఆటవస్తువులు, వంటివి పిల్లలకు మంచి అనుభవాలను అందిస్తాయి. రోజులో జరిగే చర్యలను కథలద్వారా వివరించండి. పిల్లల ఆసక్తిని నిర్మాణాత్మకంగా మలచాలి. ప్రతి కథా ఆసక్తికరం గా చేయవచ్చు. అవి వారికి పెయింటింగ్, కుకింగ్ మొదలైన విషయాలను తెలియజేస్తాయి.

***ముగింపు*** - పిల్లలకు కథ అంతా చెప్పిన తరువాత కథ ముగింపు ఆలోచించి వారినే చెప్పమనాలి. అపుడు వారిలో ఊహా శక్తి పెరుగుతుంది. ముగింపులకు కూడా ప్రత్యామ్నాయాలు సూచించమనాలి. ఉదాహరణకు డినోసార్ జంతువులు మనం కూర్చున్న థియేటర్ లోకి వస్తే ఏం చేస్తావని ప్రశ్నించాలి. పిల్లలకు వారి బొమ్మలలో రంగులవారీగా వరుసలో పెట్టమని చెప్పాలి. వారి గదిని సర్దుకోవటంలో కొంత సమయం కేటాయించి ఏది ఎక్కడ పెట్టాలో తెలుపాలి. వారి ఆట వస్తువులను పెద్దవి, మీడియం, చిన్నవి గా ఏర్పాటు చేయమనాలి. వారిలో లెక్కలు, రీజనింగ్ మైండ్ అభివృద్ధి చెందుతుంది.

**చురుకు** - పిల్లలను చురుకుగా వుంచాలి. వారికి వేటిపట్ల ఆసక్తి వుందో గమనించాలి. దానికి సంబంధించిన పిల్లలతో వారికి స్నేహం ఏర్పరచాలి. ఉదాహరణకు పిల్లవాడికి మ్యూజిక్ అంటే ఆసక్తి వుంటే, అతను నేర్చుకుంటుంటే, మ్యూజిక్ బాగా తెలిసిన పిల్లలను పిలిచి ఇంటిలో ఒక ప్రొగ్రాము ఏర్పరచండి. అదే రకంగా వారిని కథలు వ్రాయమని కూడా ప్రోత్సహించండి. వారి ఆలోచనా శక్తి పెంచేందుకు ఒక పక్షి, గుర్రం, డాల్ఫిన్ వంటి వాటి గురించి వ్రాయమనండి. పజిల్స్, బోర్డ్ గేములు, బిల్డింగ్ బ్లాకులు, వారిలో ఆలోచన పెంచుతాయి. చిన్నతనం నుండి వారికి వ్రాయడం నేర్పిస్తే, ఆలోచనా పరిధి పెరుగుతుంది.

**ఆసక్తి** - పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి వుందో పరిశీలించండి. వారికి ఆసక్తికల రంగాలలో మీరు ప్రోత్సహించినట్లయితే, వారి ప్రతిభా పాటవాలు పెరిగి అందులో ఉన్నతులవుతారు.

మిడ్డను ఆలోచించనివ్వండి.

స్వేచ్ఛగా తన భావాలను ప్రకటించనివ్వండి. అతనికై అతనే వాస్తవాలను వెల్లడిచేయనివ్వండి. మీ బిడ్డ ఆలోచనలకు విలువనివ్వండి. పిల్లలు వారున్న పరిస్థితులనుండే నేర్చుకుంటారు. గుర్తింపునిస్తే వారు లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. ప్రోత్సహిస్తే తమలో ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు.

## బట్టతల రాకుండా కాపాడే సహజ సిద్ధమైన ఉపాయాలు...

సాధారణంగా వెంట్రుకలు రాలిపోతున్నాయి అని చాలామంది అంటుండం వింటుంటాం. తల్లో దువ్వెన పెడితే చాలు వెంట్రుకలు విపరీతంగా రాలి పోతున్నాయి, బట్టతల వచ్చేస్తుందేమో అని బాధపడే మగవారి సంఖ్య పెరిగిపోయింది ఈ మధ్య. దాంతో బట్టతల రాకుండా నివారించుకునేందుకు ఎంతో ఖర్చు పెట్టి సెలూన్ల చుట్టూ తిరిగి హెయిర్ ట్రీట్‌మెంట్‌లు తీసుకుంటున్నారు. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయించుకుంటున్నారు. అసలు కారణాన్ని తెలుసుకోకుండా ఇలాంటి ప్రయత్నాలు ఎన్ని చేసినా వృథానే.

అందులోను జుట్టు రాలడాన్ని నియంత్రించేందుకు డబ్బులుపోసి పార్లర్లకు పరిగెత్తక్కర్లేదు. ఇంట్లోనే చేసుకునే ఎన్నో మంచి చిట్కాలు ఉన్నాయి. ముందుగా జుట్టు రాలడానికి కారణాలు తెలుసుకుని ఆ తరువాత వాటికి తగ్గ రెమెడీలు పాటిస్తే చాలు బట్టతలకు దూరంగా ఉండొచ్చంటున్నారు నిపుణులు.

పోషకాహారం తీసుకోకపోవడం, విటమిన్, జన్యు లోపాలు, అధిక ఒత్తిడి, ఆందోళన, ఇబ్బందులు, టై%ఫాయిడ్, రక్తహీనత, విరేచనాలు, కామెర్ల వంటి దీర్ఘకాల అనారోగ్యాల వంటివి జుట్టు రాలడానికి కారణాలవుతాయి. వీటితోపాటు రక్త సరఫరా సరిగా లేకపోవడం, తల సరిగా శుభ్రం చేసుకోవడం వంటివి కూడా కారణాలే. జుట్టు రాలకుండా ఇంట్లోనే పాటించే కొన్ని జాగ్రత్తలు మీకోసం...వీటిని అనుసరించి బట్టతల బారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు.

1. రోజూ ఉదయాన్నే ఒక ఉసిరి కాయ తినాలి.

2.. ప్రతిరోజూ రాత్రి ఐదు బాదం గింజలను నానపెట్టి వాటిని తెల్లవారి ఉదయాన పొట్టు తీయకుండా తినేయాలి.

3. ఒక గిన్నెడు మొలకెత్తిన గింజలు తినాలి. ప్రొటీన్ల కోసం ప్రతిరోజూ ఒక గుడ్డు తినాలి. కోడి కూర కూడా తినాలి.

4. స్ట్రాబెర్రీలు, అరటిపండ్లు, యాపిల్స్, మామిడి పండ్లు, సపోట, ద్రాక్షలను రోజూ రెండు లేదా మూడు పళ్లు తింటే మంచిది.

5. ఉదయాన్నే అవిసె గింజలు నానపెట్టిన ఒక గ్లాసు మంచి నీటిని తీసుకోవాలి. అవిసె గింజల్లో ఒమెగా 3 ఆమ్లాలు ఉంటాయి. ఇది జుట్టు పెరుగుదలకు ఉపయోగపడుతుంది.

6. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. రోజూ ఎనిమిది నుంచి పది గ్లాసుల నీళ్లు తప్పక తాగాలి. ఇవి జుట్టుకి కావలసిన పోషకాలను అందిస్తాయి.

7. టీ, కాఫీలు తగ్గించాలి. పూర్తిగా మానేస్తే మంచిది. అలాగని టీ, కాఫీ ప్రియులు నోరు కట్టేసుకోలేరు కాబట్టి రోజుకి రెండు గ్లాసుల వెన్న తీసిన పాలు తాగితే ఎంతో లాభం.

8. వారానికి ఒకసారి మెంతి గింజల గుజ్జును మాడుకు పట్టించి అరగంట తరువాత తల శుభ్రం చేసుకోవాలి. అలాగే పరగడుపున మెంతులు నానపెట్టిన నీళ్లు తాగాలి.

9. కూరగాయలు ఎక్కువగా తినాలి. పాలకూర ఎంత ఎక్కువగా తింటే అంత మంచిది. చేపలు, కోడి, గుడ్లు వాడకం పెంచితే జుట్టు బాగుంటుంది. రెడ్ మీట్‌కి దూరంగా ఉండాలి.

10. తలస్నానం చివర్లో ఒక టీ స్పూను నిమ్మరసంతో కడిగేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తూ ఉంటుంది. చుండ్రు రాదు.




# కిడ్నీలు ఫెయిలైతే?



మన శరీరంలో అతిముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు (మూత్రపిండాలు) జీవనక్రియల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. మనం తీసుకునే ఆహారపు అలవాట్లు, ఇతర్రతా కారణాల వల్ల కిడ్నీ సంబంధ సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రతి యేటా 17శాతం కిడ్నీ సంబంధ సమస్యలు పెరుగుతున్నట్లు అంచనా.

**యురినరీ ఇన్‌ఫెక్షన్......**

మూత్రం పోసే టప్పుడు మంటగా ఉండటం, మాటి మాటికి యూరిన్ రావడం, బొడ్డు కిందభాగంలో నొప్పి, జ్వరం రావడం యురినరీ ఇన్‌ఫెక్షన్ ముఖ్యలక్షణాలు. దీన్ని మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. ముఖ్యంగా పిల్లలలో దీనికి చికిత్స ఇస్తున్నప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించడం అవసరం. చికిత్స ఇవ్వడం ఆలస్యం చేసినా, సరైన చికిత్స ఇవ్వకపోయినా కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది.

**డయాలసిస్......**

శరీరంలో రెండు కిడ్నీలు పాడైపోయినప్పుడు శరీరంలో అనవసరమైన, విసర్జించబడిన పదార్థాలు, నీటి పరిణామము ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని బయటకు పంపించే ప్రక్రియను డయాలసిస్ అంటారు.

**మిషన్ ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడం (హిమోడయాలసిస్).....**

ఈ పద్ధతిలో హీమోడయాలసిస్ అనే మిషన్ సాయంతో కృత్రిమ కిడ్నీ (డయలైజర్)లో రక్తాన్ని శుద్ధి చేస్తారు. మిషన్ సాయంతో రక్తాన్ని శుభ్రపర్చి తిరిగి శరీరంలోకి పంపుతుంటారు. రోగి ఆరోగ్యకరంగా ఉండటానికి వారానికి రెండు లేక మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది.

హీమోడయాలసిస్ చేసుకునే సమయంలో మంచంపై ఉండగానే రోగి ఆహారం తీసుకోవడం, టీవి చూడటం వంటి పనులు చేసుకోవచ్చు. ప్రతి సారి డయాలసిస్ చేసుకునేందుకు 4గంటల సమయం పడుతుంది.

ప్రతీ సంవత్సరం మార్చి-10న వరల్డ్ కిడ్నీడేను జరుపుకుంటాం. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్యసంస్థ పిల్లల్లో కిడ్నీ సంబంధ సమస్యలు - ప్రజల్లో అవగాహన" అనే అంశాన్ని థీంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే కిడ్నీ సంబంధ సమస్యలు, ఇతర కిడ్నీ సంబంధ సమస్యలను మొదట్లోనే గుర్తిస్తే చికిత్సను అందించడంతో వారు ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు అవకాశముంటుంది. పిల్లల్లో కిడ్నీ సంబంధ అనారోగ్యాలు వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. సాధారణ ఇబ్బందుల నుంచి మొదలుకొని ప్రాణహాని వరకు దారితీయవచ్చు.

చిక్కుడు గింజ ఆకారంలో ఉండే రెండు మూత్రపిండాలు ఉంటాయి. ఇవి కడుపులో వెనుక భాగంలో వెన్నెముకకు ఇరువైపులా ఛాతికి కింది భాగంలో ఎముకల మధ్య సురక్షితంగా ఇమిడి ఉంటాయి. ప్రతీ వ్యక్తిలో కిడ్నీ సాధారణంగా 10సెంటీమీటర్ల పొడవు, 5సెంటీమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని బరువు 150 నుంచి 170 గ్రాముల వరకు ఉంటుంది. కిడ్నీలు శరీరంలోని రక్తన్ని శుద్ధిచేసి వ్యర్థాలను మూత్రవిసర్జన ద్వారా బయటకు పంపుతుంది. వీటితో పాటు శరీరంలో నీటిసమతుల్యత, బ్లడ్ ప్రెషర్, రక్తపు గడ్డలు, కాల్షియం నియంత్రణ చేస్తుంది. మనశరీరంలో ప్రతి రెండు నిమిషాలకు రెండు కిడ్నీలలో 1200 మి.లీ. రక్తం శుభ్రమవుతుంది. 24 గంటల్లో సుమారు 1700 వందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది.


**కిడ్నీ వ్యాధి లక్షణాలు.......**

- ఉదయం నిద్రలేచిన వెంటనే కళ్ళు వాచి ఉండటం
- ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు, వికారంగా అనిపించడం
- రాత్రిళ్ళు ఎక్కువగా మూత్రవిసర్జనకు వెళ్ళాల్సి రావడం
- చిన్న వయస్సులోనే రక్తపోటు వ్యాధి ఉండటం
- కొంచెం నడిచే సరికి ఆయాసం, నీరసంగా అనిపించడం
- 6 సంవత్సరాల తరువాత కూడా మంచంపై మూత్రవిసర్జన చేయటం
- మూత్రవిసర్జన సమయంలో మంట, చీము, రక్తం రావటం, మూత్రం బొట్లు బొట్లుగా రావటం.
- కడుపులో పుండ్లు అవటం, కాళ్ళు, నడుములో నొప్పులు కలగటం

వంటి లక్షణాలు సాధారణాలుంటే కిడ్నీ సంబంధ వ్యాధిగా గుర్తించి పరీక్షలు చేయించుకోవాలి.

### నీళ్లు సరిగ్గా తాగడం లేదని


# తెలిపే డేంజర్ సంకేతాలివే..



నీళ్లు తాగుతున్నారా ? అంటే బాగా తాగున్నాను అన్న సమాధానమే చాలా మంది చెబుతారు. కానీ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక బాటిల్ లేదా ఒక లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. ఇది ఒకరు, ఇద్దరి సమస్య కాదు. చాలా మంది నీళ్లు తాగాలంటే చాలా బద్ధకంగా ఫీలవుతారు. అలాగే నీళ్ల తాగడం అంటే.. ఏదో మెడిసిన్ తాగినట్టు ఫీలవుతుంటారు. కానీ.. నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి.

10 రోజుల్లో ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే వాటర్ డైట్ శరీరంలోని ప్రతి భాగం, ప్రతి చిన్న అవయవం, టిష్యూ, కణం అన్నీ కూడా నీటిపై ఆధారపడి ఉంటాయి. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఫ్లూయిడ్స్ స్థాయి బ్యాలెన్స్ గా ఉంటుంది. బాడీ టెంపరేచర్ రెగ్యులేట్ అవుతుంది. మలినాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అంతే చర్మం ప్రకాశవంతంగా కనిపించడానికి కూడా నీళ్లు తాగడం తప్పనిసరి. రైస్ వాట్‌తో మైండ్ బ్లోయింగ్ బెన్ఫిట్స్ అయితే శరీరానికి కావాల్సిన స్థాయిలో నీళ్లు అందకపోతే.. శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయి.

# వడదెబ్బకు 'ఉల్లి' వైద్యం



వడదెబ్బనుంచి ఉపశమనం కలిగించడంలో ఉల్లి చాలా ఉత్తమమైనదని ఆయుర్వేదం చాలా స్పష్టంగా పేర్కొంది. ఉల్లిరసాన్ని చెవుల వెనుక భాగాన, ఛాతీ పైన పెడితే శరీర ఉష్ణోగ్రత చాలా వరకు తగ్గుతుంది. ఉల్లిపాయలను దోరగా వేయించి జీలకర్ర, తేనె కలిపి కడుపులో తీసుకుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. చట్నీలల్లో, సలాడ్స్‌లలో ఉల్లిపాయలు వేసి తీసుకున్నా, మీ శరీర వ్యవస్థ అంతా చల్లబడుతుంది. చింతపండులో విటమిన్లు, లవణాలు, ఎలక్ట్రలైట్స్ సమృద్ధిగా ఉంటాయి. చింతపండును నీళ్లల్లో ఉండికించి ఆ రసంలో కొంచెంగా చక్కెర వేసి తీసుకోవచ్చు. ఈ రసం శరీర ఉష్ణోగ్రత్తను తగ్గిస్తుంది. ఈ రసం లక్జేటివ్‌గా కూడా పనికిరావడంతో పాటు ఉదర వ్యవస్థలోని ఇబ్బందులను కూడా ఇది తొలగిస్తుంది. మామిడి రసం శరీరానికి రెట్టింపు శక్తినివ్వగల టానిక్. పచ్చి మామిడిపండ్ల రసాన్ని తీసుకుంటే, అందులో అతి స్వల్పంగా పచ్చిమిరపకాయలు కూడా వేస్తే, అది మన శరీరాన్ని చల్లబరుస్తుంది. అయితే ఈ ఉసాన్ని రోజుకు రెండు మూడు సార్లయినా తీసుకోవాలి. అయితే ఈ రసంలో జీలకర్ర, సోంపు, మిర్యాలు, నల్లఉప్పును కూడా స్వల్పంగా కలిపితే శక్తిని ఇవ్వడమే కాదు, ఎలక్ట్రలైట్స్ నిలువల్ని పెంచుతాయి. ఆలూ బుకార్ పండ్లల్లో శరీరాన్ని తేమతో ఉంచే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర అంతర్భాగాల్లో ఏర్పడే వాపును తగ్గిస్తాయి. ఆలు బుకార్ పండ్లను నీళ్లల్లో నానవేసి బాగా మెత్తపడ్డాక వాటిని పిసికి వాటితో ఒక ద్రావణం చేయాలి. ఇది వడదెబ్బనుంచి ఉపశమనం కలిగిస్తుంది. ధనియాల రసం, పూదీన రసం కూడా వడదెబ్బ బాధలనుంచి విముక్తి క లిగిస్తాయి. తులసి గింజలు, సోంపుగింజల్ని నీళ్లల్లో నానవేసి అందులో కొంచెంగా రోజ్ వాటర్ కలిపి తీసుకుంటే మరీ మంచిది. ఆపిల్ సైడర్ వెనెగర్‌ను కూడా చల్లని నీటిలో కలిపి అందులో కాసింత తేనె కలిపి తీసుకోవచ్చు.

# చిత్రభాను

# లై, జానకీ నాయక, నేనే రాజు....

## మొదటి రోజు కలెక్షన్లు ఎలాఉన్నాయంటే...

రానా-నేనే రాజు-నేనే మంత్రి, నితిన్-లై, బెల్లంకొండ శ్రీనివాస్-జయ జానకి నాయక చిత్రాలు ఒకే రోజు రిలీజ్ అయ్యాయి. అయితే ఈ చిత్రాలపై మొదటి నుంచి విపరీతమైన క్రేజ్ పెంచుతూ ఆడియన్స్ ని తెగ ఇంప్రెస్ చేస్తూ వచ్చారు. నిన్న మొన్నటి వరకు హీరో రానా ఎన్ని రకాలుగా ప్రమోషన్ చేయాలో అన్ని రకాలుగానూ ట్రై చేసారు. అంతెందుకు ఇప్పుడు బుల్లి తెర ప్రేక్షకులను కట్టి పడేస్తున్న 'బిగ్ బాస్ ' షో లో కూడా సందడి చేశాడు, ఇక బోయపాటి శ్రీనివాస్ తెరకెక్కించిన జయ జానకి నాయక చిత్రం కోసం ఏకంగా శ్రీనివాస్, రకుల్, కేథరిన్ ఎన్నో చానల్స్ లో చిట్ చాట్ చేస్తూ కనిపించారు. నితిన్ నటించిన 'లై' చిత్రానికైతే త్రివిక్రమ్, టాలీవుడ్ ప్రముఖులు తెగ మెచ్చుకుంటూ ప్రమోట్ చేశారు. ఈ చిత్రాల్లో నటించిన హీరోలు తమ చిత్రాలపై ఎంతో నమ్మకాన్ని కూడా పెంచుకున్నారు. ఇక లై, జయ జానకి చిత్రాలు హిట్ అయినా 45 నుంచి 50 కోట్ల వసూళ్లు సాధిస్తేనే బయ్యర్స్ ప్రాఫిట్ జోన్ కు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇక ఈ క్రమంలో ఈ మూడు సినిమాల మొదటి రోజు కలెక్షన్లు ఎలా ఉన్నాయి అని పరిశీలిస్తే...

బోయపాటి శ్రీనివాస్- బెల్లంకొండ శ్రీనివాస్ కాంబినేషన్ లో విడుదలైన సినిమా జయ జానకీ నాయక. ఎక్కువ స్క్రీన్ లు దొరక్కపోయినా, మంచి కలెక్షన్లు సాధించింది. నైజాం 90 లక్షలు, సీడెడ్ 55, నెల్లూరు 19, గుంటూరు 49, కృష? 16, వెస్ట్ 28, ఈస్ట్ 24, ఉత్తరాంధ్ర 45 లక్షలు.

నితిన్ - హను రాఘవపూడి కాంబినేషన్ లో 14 రీల్స్ సంస్థ నిర్మించిన చిత్రం లై. ఈ సినిమా ఫస్ట్ డే కలెక్షన్ల వివరాలు ఇలా వున్నాయి. నైజాం 81 లక్షలు, సీడెడ్ 42, నెల్లూరు 6, గుంటూరు 17, కృషా? 17, వెస్ట్ 11, ఈస్ట్ 21, ఉత్తరాంధ్ర 33 లక్షలు.

మిగిలిన వారి కన్నా బెటర్ గా ఎక్కువ సంఖ్యలో థియేటర్లు సాధించి తన కొడుకు రానా సినిమాను విడుదల చేయించగలిగారు. దాంతో తొలి రోజు మంచి ఫలితాలే నమోదు





చేసింది. కలెక్షన్ల వివరాలు ఇలా వున్నాయి. నైజాం 122 లక్షలు, సీడెడ్ 65 లక్షలు, నెల్లూరు 9 లక్షలు, గుంటూరు 24 లక్షలు, కృష? 28 లక్షలు, పశ్చిమ 20 లక్షలు, ఈస్ట్ .35 లక్షలు, ఉత్తరాంధ్ర 68 లక్షలు.


## పైసా వసూల్ ఆడియో తేదీ ఖరారు

సినిమా ప్రారంభోత్సవం రోజున విడుదల తేదీ ప్రకటించడం ఇటీవల తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జరుగుతున్నదే. అయితే... ముందు ప్రకటించిన విడుదల తేదీ కంటే ఓ నెల రోజుల ముందే రాబోతున్నది మాత్రం 'పైసా వసూల్' చిత్రమే. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ముందు చెప్పిన తేదీ కంటే నెల రోజుల ముందు విడుదల కానున్న సినిమాగా 'పైసా వసూల్' చరిత్ర సృష్టించడానికి సిద్ధమైంది. నందమూరి బాలకృష్ణ స్పీడు, దర్శకుడు పూరి జగన్నాథ్ సూపర్ క్లారిటీ, భవ్య క్రియేషన్స్ ప్రొడక్షన్ వేల్యూస్ వల్లే ఇది సాధ్యమవుతోంది. బాలకృష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనందప్రసాద్ నిర్మించిన సినిమా 'పైసా వసూల్'. సెప్టెంబర్ 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ నెల 17న ఖమ్మంలో అభిమానుల సమక్షంలో జరగనున్న భారీ వేడుకలో 'పైసా వసూల్' పాటలను విడుదల చేయనున్నారు. ఈ వేడుకకు హీరో బాలకృష్ణ, దర్శకుడు పూరి జగన్నాథ్, నిర్మాత వి. ఆనందప్రసాద్‌లు హైదరాబాద్ నుంచి ఖమ్మంకు హెలికాప్టర్‌లో వెళ్లనున్నారు. అదే రోజున సినిమా ట్రైలర్‌ను కూడా విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా స్టంపర్ రికార్డులు సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్మాత వి. ఆనందప్రసాద్ మాట్లాడుతూ- "నందమూరి బాలకృష్ణ గారితో సినిమా చేసినందుకు ఆనందంగానూ, గర్వంగానూ ఉంది. అదీ పూరి జగన్నాథ్‌గారి దర్శకత్వంలో 'పైసా వసూల్' వంటి సినిమా చేసినందుకు మరింత ఆనందంగా ఉంది. స్టంపర్‌కు వస్తోన్న స్పందనను బట్టి నందమూరి అభిమానులు, ప్రేక్షకులు సినిమా కోసం ఎంతగా ఎదురు చూస్తున్నారో చెప్పొచ్చు.

## చైతన్య సమంతల పెళ్ళి కార్డు రెడీ



అంతా అనుకున్నట్టుగానే నాగచైతన్య సమంత వివాహం అక్టోబర్ లోనే ఫిక్స్ అయింది. అక్టోబర్ ఆరున మా పెళ్లి అంటూ నాగచైతన్య ప్రకటించేశాడు. జియో ఫిలిం ఫేర్ అవార్డులకు హాజరైన చైతూ అక్కడ ఓ ఇంటర్వ్యూ లో ఈ విషయం చెప్పాడు. చైతూ సమంత ల నిశ్చితార్థం జనవరి లో జరిగిన సంగతి తెలిసిందే. వీరి పెళ్లి ఎలా జరగబోతుందో..వీరి వెడ్డింగ్ కార్డు ఎలా ఉంటుందో అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో వీళ్ల వివాహం జరగనుంది. సమంత పెళ్లి బట్టలను ప్రముఖ డిజైనర్ క్రిషా బజాజ్ డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సమంత పెళ్లి చీర గురించి ఒక ఆసక్తికరమైన సంగతి తెలిసిందే. అదేంటంటే సామ్ పెళ్లిరోజు కట్టుకోబోయే చీర చైతు అమ్మమ్మది అట, అంటే ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు భార్య రాజేశ్వరిది. ఈ చీరను క్రిషా తనదైన స్టయిల్ లో మార్పులు చేస్తూ చీరపై బంగారు జరీ అంచు సొగసులు అద్దుతూ డిజైన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. దగ్గుపాటి కుటుంబాలకు చెందిన అలనాటి చీరను సమంత కోసం ఇస్తున్నారు. అంటే వారి సంప్రదాయానికి విలువిస్తున్నటు తెలుస్తుంది. అలానే పెళ్లి నగలు కూడా ఓ ప్రముఖ జ్యూవెలరీ సంస్థ డిజైన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. నగలు డైమండ్స్, కుందన్స్ తో తయారవుతున్నట్టు తెలుస్తుంది. సో చైతు సామ్ ల పెళ్లిలో రిచ్ నెస్ తో జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి సామ్ పెళ్లి చీర చూడాలంటే.. అక్టోబర్ వరకు వేచి చూడాల్సిందే. మొత్తానికి వీళ్లిద్దరి పెళ్లి శుభలేఖ సిద్ధం చేసారు ఇరు ఫ్యామిలీ పెద్దలు. గోవాలోని డబ్ల్యూ హెూటల్ లో చైతన్య-శామ్ ల పెళ్లి జరగనుంది. క్రిస్టియన్ హిందూ సంప్రదాయాల్లో 2 రోజుల పాటు ఈ పెళ్లి జరగనుంది. ప్రీ-వెడ్డింగ్ వేడుకను కూడా ఈ 2 రోజుల్లోనే పూర్తిచేయాలని నిర?యించారు.






## కాజల్ అగర్వాల్ హిందీలో కూడా

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ పోలీసాఫీసర్‌గా నెగటివ్ టచ్‌తో దుమ్మురేపిన చిత్రం టెంపర్. ఇప్పుడు ఈ సినిమా బాలీవుడ్‌లో రీమేక్ కాబోతుంది. బీటౌన్ యాక్షన్ అండ్ కామెడీ మూవీస్ స్పెషలిస్ట్ రోహిత్ శెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. తాజాగా ఈ రీమేక్ మూవీలో రణ్ వీర్ సింగ్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని తనే వెల్లడించాడు. 'టెంపర్' హిందీ రీమేక్ గురించి చాన్నాళ్లుగా డిస్కషన్స్ నడుస్తున్నాయి. కానీ సినిమా అయితే ఖరారవ్వలేదు. ఎట్టకేలకు 'టెంపర్' హిందీ రీమేక్ ఓకే అయింది. అనుకున్న కాంబినేషన్లోనే ఈ సినిమా తెరకెక్కనుంది. పెద్దగా బ్యాగ్రౌండ్ లేకుండా బాలీవుడ్లోకి అడుగుపెట్టి.. వరుస హిట్లతో స్టార్ ఇమేజ్ సంపాదించిన రణ్వీర్ సింగ్ 'టెంపర్' హిందీ రీమేక్‌లో హీరోగా నటించనున్నాడు. యాక్షన్-కామెడీ ఎంటర్టైనర్లు తీయడంలో దిట్ట అయిన రోహిత్ శెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడు. ప్రస్తుతం రణ్వీర్.. సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో 'పద్మావతి' చేస్తున్నాడు. బాలీవుడ్‌లో ఇప్పటి యంగ్ హీరోస్‌లో అగ్రపథాన దూసుకుపోతు న్నాడు రణ్ వీర్ సింగ్. ప్రస్తుతం రణ్ వీర్ సంజయ్ లీలా భన్సాలీ 'పద్మావతి', జోయా అక్తర్ 'గల్లీ బోయ్స్' చిత్రాల్లో నటిస్తున్నాడు. వీటి తర్వాత ఈ రీమేక్ మూవీ ఆరంభం కానుంది. ప్రస్తుతం 'గోల్ మాల్ ఎగెయిన్'తో బిజీగా ఉన్న రోహిత్ శెట్టి త్వరలో 'టెంపర్' రీమేక్ ప్రి-ప్రొడక్షన్ వర్క్ మొదలుపెట్టనున్నాడట.



## రోబో 2.0 తెలుగు ఎంతకుకొన్నారో తెలుసా...???

రజనీకాంత్ చివరి సినిమా 'కబాలి'ని తెలుగులో దాదాపు రూ.32 కోట్లకు అమ్మారు. ఆ సినిమా ఫ్లాప్ అయినప్పటికీ ఆ ప్రభావం '2.0' మీద ఏమీ పడలేదు. ఎందుకంటే దీని మీద ఉన్న అంచనాలే వేరు. ఇది శంకర్ సినిమా ఆయె. అందులోనూ 'రోబో' తెలుగులో ఎంత పెద్ద హిట్టయిందో తెలిసిందే. '2.0' మీద అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇది కూడా 'బాహుబలి: ది కంక్లూజన్' తరహాలోనే ప్రకంపనలు సృష్టిస్తుందని.. అనూహ్యమైన వసూళ్లు సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. కబాలి సినిమా తెలుగు హక్కుల కోసం భారీగా ఖర్చుపెట్టారు ఇక్కడి ప్రముఖులు. కానీ టాలీవుడ్ లో ఆ సినిమా ఫ్లాప్ వెంచర్. అంతకంటే ముందొచ్చిన లింగా తెలుగు రైట్స్ ను కూడా ఫ్యాన్సీ రేటుకు దక్కించుకున్నారు.కానీ ఆ మూవీ రిజల్ట్ కూడా సున్నా. రజనీకాంత్ త్రీడీ సినిమా విక్రమసింహ విషయంలో కూడా ఇదే జరిగింది. ఇన్ని ఎదురు దెబ్బలు, జీవిత కాలానికి సరిపడ అనుభవాలు ఉన్నప్పటికీ.. మరోసారి రజనీకాంత్ సినిమాపై వేలం వెర్రి కనిపిస్తోంది. ఏమో గుర్రం ఎగరావచ్చు అనే టైపులో రజనీకాంత్ సినిమా బ్లాక్ బస్టర్ కావొచ్చంటూ లేటెస్ట్ మూవీ 2.0పై రికార్డు స్థాయిలో బెట్టింగ్ సాగుతోంది. ఈ సినిమా తెలుగు రైట్స్ కోసం బిడ్డింగ్ 40కోట్ల రూపాయల నుంచి ప్రారంభం కాగా, తాజాగా ఆ లెక్క 60 కోట్ల రూపాయలకు చేరింది. 'బాహుబలి: ది కంక్లూజన్' సినిమాను నైజాం ఏరియాలో డిస్ట్రిబ్యూట్ చేసిన సంస్థే శంకర్-రజినీకాంత్‌ల మాగ్నమ్ ఓపస్ '2.0'ను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతుండటం విశేషం. విడుదలకు ఆరు నెలల ముందే '2.0' తెలుగు హక్కుల డీల్ పూర్తయింది. సునీల్ నారంగ్ నేతృత్వంలోని గ్లోబల్ సినిమాస్ భాగస్వామ్యంతో తెలుగులో '2.0'ను విడుదల చేయబోతున్నట్లు ఈ చిత్ర నిర్మాణ సంస్థ 'లైకా ప్రొడక్షన్స్' ప్రకటించింది. భారీ ధరకు '2.0'ను అమ్మినట్లు లైకా అధినేత రాజు మహాలింగం ట్విట్టర్లో వెల్లడించాడు. ఆ రేటు ఎంతన్నది మాత్రం వెల్లడించలేదు. ఐతే ఈ డీల్ రూ.60 కోట్ల దాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



# 16న సీఎం కేసీఆర్ రాక

## జౌళి పార్కు నిర్మాణానికి శంకుస్థాపన



వరంగల్ : ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌కు రానున్నారు. ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. సీఎం హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి వస్తారా? లేదంటే నేరుగా పార్కు స్థలం వద్దకే వెళ్తారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. అధికారిక పర్యటన వివరాలు మరో రెండు రోజుల్లో వెల్లడవుతాయి. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ- సంగెం మండలాల మధ్య టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. 1200 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ శాఖ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థకు అప్పగించింది. టెక్స్‌టైల్ పార్కుకు కావాల్సిన అన్ని అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాన చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

# భారత సైన్యంలోకి రోబోలు!



దిల్లీ: కశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా భారత సైన్యం మరమనుషుల (రోబోలు) సహాయం తీసుకోనుందా? అంటే అవుననే అంటున్నాయి రక్షణ వర్గాలు. సైనికులకు కావాల్సిన ఆయుధ సామాగ్రిని చేరవేసేందుకు రిమోట్ ఆధారిత రోబోలను త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ఇప్పటికే 544 రోబోల తయారీకి భారత సైన్యం ప్రతిపాదనలు పంపగా, రక్షణ మంత్రిత్వశాఖ వాటికి ఆమోదం తెలిపింది. వాటి కృత్రిమ మేధస్సుపై ప్రయోగాలు ప్రారంభమవగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశాక సైన్యానికి అప్పగించనున్నారు.

ఈ రోబోలు ఉగ్రవాద ఏరివేత చర్యల్లో భాగంగా సైన్యానికి విశేషంగా సహాయ పడగలవట. పరిసరాల పర్యవేక్షణతో పాటు ఉగ్రవాదులకు ప్రధాన స్థావరాలుగా ఉండే అడవులు, మారుమూల గ్రామాల్లో సైతం ఇవి ఆటంకం లేకుండా పనిచేయగలవని అంటున్నారు. కశ్మీర్‌లో భద్రతా బలగాలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యల్లో ప్రతికూల వాతావరణం ఒకటి. ఈ రోబోల ద్వారా ఇటువంటి పరిస్థితులను అధిగమించడంతో పాటు తక్కువ దూరాలకు ఆయుధ సామాగ్రిని తరలించవచ్చని ఆర్మీ భావిస్తోంది.

# మ్యాచ్ ఫిక్సింగ్ మమ్మల్ని ఓడించలేదు!

## ముత్తయ్య మురళీధరన్

న్యూఢిల్లీ : వన్డే ప్రపంచకప్-2011 ఫైనల్లో టీమిండియా చేతిలో శ్రీలంక ఓటమిపై ఆ జట్టు మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ చేసిన ఫిక్సింగ్ తరహా వ్యాఖ్యలను మాజీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ కొట్టిపారేశాడు. ఆటగాళ్ల గాయాలు, మంచు, ఇతర కారణాల వల్లే తాము ఓటమి పాలయ్యామన్నాడు. ముంబయి వాంఖడే మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 274/6 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. ఛేదనలో గంభీర్, ధోనీ చెలరేగడంతో టీమిండియా విజయం సాధించింది.

**భయమే ఓడించింది**

రణతుంగ వ్యాఖ్యలను మురళీధరన్ తప్పుపట్టాడు. టోర్నీలో భారత్ అత్యుత్తమ జట్టు. మాది రెండో అత్యుత్తమం. ఫైనల్ గెలిచే అవకాశం మాకు ఉంది. కానీ రెండు సంఘటనలు జరిగాయి. సెమీస్‌లో నేను, ఏంజిలో మాథ్యూస్ గాయపడ్డాం. సెలెక్టర్లు చేసిన 3-4 మార్పులు రెగ్యులర్ జట్టులా అనిపించలేదు. లక్ష్యఛేదనకు సీనియర్ ఆటగాళ్లు, సెలెక్టర్లు భయపడ్డారు. తొలుత బ్యాటింగ్ చేయాలనుకున్నారు. నా అనుభవం మాత్రం టీమిండియా ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించగలిగేలా చూపింది. వాంఖడేలో మంచు ప్రభావం గురించి సంగక్కరతో చెప్పా. రిఫరీ పిచ్‌పై రసాయనాలు పిచికారీ చేయిస్తానని మాటిచ్చాడని దాంతో మంచు ప్రభావం ఉండకపోవచ్చన్నాడు. కానీ 15 ఓవర్లకే మంచు ముంచుకు రావడంతో మేమేమీ చేయలేకపోయాం. మ్యాచ్ ఫిక్సింగ్ వంటిదేమీ లేదు అని మురళీధరన్ వివరించాడు.

# చెలరేగిన భారత ఓపెనర్లు

## మిడిలార్డర్ తడబాటు

### కోహ్లీసేన 329/6



క్యాండీ: పల్లెకలె టెస్టు తొలి రోజు ఆధిపత్యం చేతులు మారింది. తొలి సెషన్‌లో టీమిండియా ఓపెనర్లు పరుగుల వరద పారించగా.. రెండో సెషన్‌లో శ్రీలంక బౌలర్లు అనూహ్యంగా పుంజుకున్నారు. చివరి సెషన్‌లో ప్రత్యర్థులు ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు ఆడారు. దీంతో మూడో టెస్టు తొలి రోజు ఆట ముగిసే సరికి కోహ్లీసేన 329/6తో నిలిచింది. శిఖర్ ధవన్ శతకం, లోకేశ్ రాహుల్ అర్ధశతకాలతో రాణించారు. మొత్తానికి ఆతిథ్య జట్టు పట్టుదల ప్రదర్శించడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది.

**ఆరంభం నుంచీ దూకుడు**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీసేనకు శుభారంభం లభించింది. ఓపెనర్లు శిఖర్ ధవన్ (119; 123 బంతుల్లో 17x4) శతకం, స్ట్రోక్ ప్లేయర్ లోకేశ్ రాహుల్ (85; 135 బంతుల్లో 8x4) అర్ధశతకంతో చెలరేగారు. తొలి వికెట్‌కు 188 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు. ఆరంభం నుంచే ఇద్దరూ నువ్వానేనా అన్నట్టు చక్కని షాట్లు బాదడంతో 55 బంతుల్లోనే 50 పరుగులొచ్చాయి. ఆ తర్వాత అదే ఒరవడి కొనసాగించి అర్ధశతకాలు సాధించడంతో లంచ్ సమయానికి టీమిండియా 134/0తో నిలిచింది.

**బౌలర్ల టర్న్**

లంచ్ తర్వాత శ్రీలంక బౌలర్లు అనూహ్యంగా విజృంభించారు. సహనంతో చక్కని లైన్ అండ్ లెంగ్త్ బంతులు విసిరారు. దీంతో పుష్పకుమార్ వేసిన 39.3వ బంతికి రాహుల్ కరుణరత్నెకు క్యాచ్ ఇచ్చి శతకం చేజార్చుకున్నాడు. ఈ క్రమంలోనే శతకం బాది వూపుమీదున్న శిఖర్‌ను పుష్పకుమారే జట్టు స్కోరు 219 వద్ద పెవిలియన్ పంపించాడు. అక్కడికి మరో 10 పరుగులకే సిరీస్‌లో రెండు శతకాలతో జోరు మీదున్న చెతేశ్వర్ పుజారా (8)ను సందకన్ ఔట్ చేయడంతో రెండో సెషన్ ముగిసే సరికి టీమిండియా 235/3తో నిలిచింది.

**మూడో సెషన్ మిశ్రమం**

మూడో సెషన్‌లో సారథి విరాట్ కోహ్లి (42; 84 బంతుల్లో 3x4), రహానె (17; 48 బంతుల్లో 1x4)తో కలిసి శ్రీలంక బౌలింగ్‌ను ఎదుర్కొనే ప్రయత్నం చేశాడు. నిలకడగా ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. అర్ధశతకానికి చేరువైన అతడిని ఓ చక్కని బంతికి సందకన్ పెవిలియన్ చేర్చాడు. అప్పుడు జట్టు స్కోరు 296/5. అంతకు ముందే రహానెను పుష్పకుమార్ ఔట్ చేశాడు. ఐతే రవిచంద్రన్ అశ్విన్ (31; 75 బంతుల్లో 1x4) కాస్త ఆచితూచి ఆడడంతో భారత్ 80.3వ ఓవర్‌లో 300 పరుగుల మైలురాయి దాటింది.

కొద్దిసేపటికే అశ్విన్‌ను ఫెర్నాండో పెవిలియన్ చేర్చాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 329/6తో నిలిచింది. వృద్ధిమాన్ సాహా (13 బ్యాటింగ్), హార్దిక్ పాండ్యా (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో పుష్పకుమార్ 3, సందకన్ 2 వికెట్లు తీశారు.

# జమ్మికుంటలో నిత్యం జనగణమన

## పంద్రాగస్టు నుంచి పట్టణవాసులంతా ఆలాపన

## పోలీసుల ఏర్పాట్లు




జమ్మికుంట: దేశభక్తి జాతీయతను అలవర్చేందుకు జాతీయ గీతాన్ని నిత్యం ఆలపించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. పంద్రాగస్టు నుంచే జమ్మికుంటలో ఉదయం 8 గంటలకు ప్రతి రోజు జాతీయ గీతం జనగణ మన ఆలాపన, జాతీయ పతాకానికి వందనం చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకు స్థానిక సీఐ పి.ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని కూడళ్లు, రహదారుల వద్ద 12 ప్రాంతాల్లో మైక్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పతాకావిష్కరణ సమయంలో మైక్‌ల ద్వారా వచ్చే సైరన్ అనంతరం జాతీయ గీతాలాపన జరుగుతుంది. గీతాలాపన సమయంలో పనులకు వెళ్లే వారు ఎక్కడి వారు అక్కడే ఆగి పతాకవందనం అనంతరం వారి పనుల్లో నిమగ్నం కావాలని స్థానిక సీఐ ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సమీపంలోనే ఉండటంతో స్థానిక గాంధీచౌక్, ఆర్వోబీ వంతెన ప్రధాన మార్గంలో పోలీసులు జన గణ మన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని సీఐ పేర్కొన్నారు.

# క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన లలిత్ మోడీ



న్యూఢిల్లీ : ఐపీఎల్ మాజీ చీఫ్ లలిత్ మోడీ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశారు. నాగ్‌పూర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి లలిత్ మోడీ రాజీనామా చేశారు. రాజీనామా 3 పేజీల లేఖను బీసీసీఐ ప్రతినిధి రాహుల్ జోహ్రికి పంపించినట్లు లలిత్ తెలిపారు. క్రికెట్‌కు పూర్తిస్థాయిలో గుడ్ బై చెబుతున్నట్లు లలిత్ ట్వీట్ చేశారు. తన అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. నాగ్‌పూర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో లలిత్ సభ్యుడిగా ఉండడంతో రాజస్థాన్‌లో క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించకుండా బీసీసీఐ నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

బీసీసీఐ నుంచి రూ.100 కోట్ల నిధులు రావచ్చని రాజస్థాన్ క్రికెట్ బోర్డు నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అడ్డగోలు నిర్మాణాలు కూల్చేసుకోండి

## నిబంధనలు అతిక్రమించొద్దు .. కూల్చే పరిస్థితి తెచ్చుకోవద్దు

## రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: భవన నిర్మాణ నిబంధనలను ఎవరూ అతిక్రమించవద్దని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రభుత్వమే వీటిని నియంత్రించే పరిస్థితి తేవొద్దని, ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరపాలన్నారు. తెలం గాణ బిల్డర్స్ అసోసియేషన్ మూడో వార్షిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కేటీఆర్... బిల్డర్స్‌కు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వచ్చాక నిర్మాణ రంగానికి ప్రభు త్వం ఊతమిచ్చిందని చెప్పారు. కానీ.. ఇప్పటికీ కొంద రు నిబంధనలు అతిక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణాల నిబంధనలు అతిక్రమిస్తు న్నారు. శివారు ప్రాంతాల్లో గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొన్నిచోట్ల పాత తేదీల్లో అనుమతులు పొందినట్టుగా రికార్డులు సృష్టిస్తున్నారు. అన్నీ గమిస్తున్నాం. సెట్ బ్యాక్, ఎత్తు, రహదారి, పార్కింగ్ వంటి నిబంధనలు పాటించడం లేదు. ఇష్టమొచ్చినట్టు కడుతున్నారు. ఏదైనా జరగానిది జరిగితే ఎవరు బాధ్యులు?. ఎవరూ దురాశకు పోవద్దు. శివారు ప్రాంతాలన్నీ ఎప్పటికైనా జీహెచ్‌ఎంసీలో కలిసేవే. అప్పుడు ప్రభుత్వం వాటిని నియంత్రించి, కూల్చే పరిస్థితి తెచ్చుకోవద్దు. ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించండి. నిబంధనల మేరకు నిర్మాణాలు జరపండి. అని కేటీఆర్ సూచిం చారు. భవన నిర్మాణ అనుమతులు సింగిల్ విండో విధానంలో ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. డీపీ ఎంఎస్ విధానంతో ఇప్పటికే అవినీతి కొంత తగ్గింద న్నారు. ప్రభుత్వం పారదర్శక పాలనకు కృషి చేస్తోంద న్నారు. హైదరాబాద్‌ను ఆరేడేళ్లలో విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రూ. 1600 కోట్లతో 33 కిమీల మేర మూసీ సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. బంజారాహిల్స్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నామ న్నారు. పలుచోట్ల స్కైవే, ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడుతు న్నామన్నారు. రూ. 3 వేల కోట్లతో... స్ట్రేటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద రహదారులను ఆధునీ కరిస్తున్నామన్నారు. ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వరకు వైట్‌ట్యాపింగ్ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఏడా దిలో పూర్తి చేస్తామన్నారు. వరద నీటిని తట్టుకునే డ్రైనేజీ వ్యవస్థ లేదని, అందుకే భారీ వర్షాల సమ యంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రూ. 11 వేల కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామన్నారు. ఇవన్నీ కల్పన కాదు... చిత్తశుద్ధితో సాధించి తీరుతామ న్నారు. నవంబర్ నెలలో మెట్రో రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభి స్తారని చెప్పారు.

**మూడేళ్లలో మెరుగైన అభివృద్ధి**

రాష్ట్రం ఆవిర్భవించిన మూడేళ్లలోనే అభివృద్ధిలో దూసుకుపోతోందని, అనేక రంగాల్లో దేశంలోనే ముందు వరుసలో నిలిచిందన్నారు. 13 సంవత్సరాల క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా శంకుస్థాప నలు చేసుకునే స్థాయిలోనే ఉన్నాయన్నారు. అయినా తెలంగాణ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ జనార్దన్‌రెడ్డి, న్యాక్ డీజీ బిక్షపతి, బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రావు, వెంకట్ రెడ్డి, ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.






VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com